విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు..

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :128 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 26 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# ఉత్తరాంధ్రలో వరద నష్టం

- వందల ఎకరాల్లో నీటమునిగిన పంటలు
- నిండుకుండలా జలాశయాలు
- తీవ్ర వాయుగుండం ప్రభావంతో 3-4 రోజులపాటు కురిసిన వర్షాలు
- ఉత్తరాంధ్ర కరవు తీర్చినా తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి
- ప్రధానంగా చాలా చోట్ల రోడ్లు, వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి.




అమరావతి

తీవ్ర వాయుగుండం ప్రభావంతో 3-4 రోజులపాటు కురిసిన వర్షాలు ఉత్తరాంధ్ర కరవు తీర్చినా తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ప్రధానంగా చాలా చోట్ల రోడ్లు, వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. గాలి వానలు వందల ఎకరాల్లో పంటలను దెబ్బతీశాయి. ఏజెన్సీల్లో జలాశయాలు నిండుకుండల్లా మారగా గెడ్డలు ఇంకా పొంగిపొర్లుతూనే ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కురిసిన వర్షాలకు చాలా చోట్ల వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. పాడేరు నుంచి జి.మాడుగుల మీదుగా చింతపల్లి వెళ్లే మార్గం కుంగి రాకపోకలు నిలిచాయి. వాగుల ఉద్ధృతికి జీ.కే వీధి, పాడేరు, ముంచంగిపుట్టు జి.మాడుగుల, పెదబయలు మండలాల్లో కొన్ని గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

వివరాలు 2లో..

## ఓటు బ్యాంక్ రాజకీయాలపై కాదు సామాజిక సంస్కరణలపై దృష్టి పెట్టండి

- కార్యకర్తలకు మోదీ పిలుపు
- 12 ఏళ్లలో దేశంలోని నగరాలు, గ్రామాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందన్న ప్రధాని
- గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఎంతో మెరుగుపడ్డాయని చెప్పిన నరేంద్ర మోదీ
- దేశంలో మహిళల్లో స్వయం సమృద్ధి కూడా పెరిగింది





## ఐరాస పట్ల వారికి నిజమైన శ్రద్ధలేదు

- కేవలం దానిని వాడుకుంటున్నారు
- ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు వ్యతిరేకించే వారికి దాని పట్ల నిజమైన శ్రద్ధలేదు
- కేవలం వారు దానిని వాడుకుంటున్నారు
- భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు

## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ



- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- రాష్ట్రవ్యాప్తంగా 2,619 కొనుగోలు కేంద్రాలు
- వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ ఖరీఫ్‌లో దాదాపు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యం
- ఎల్‌నినో ప్రభావంతో ధాన్యం సేకరణ అంచనా తగ్గింది
- కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం రవాణాకు 31 వేల వాహనాలు అందుబాటులో ఉంచుతాం.

## పాకిస్థాన్‌కు నిద్ర పట్టనివ్వడం లేదు

- అంతర్జాతీయ ట్రేడ్ షో నాల్గో ఎడిషన్ కార్యక్రమంలో ప్రసంగించిన అమిత్ షా
- బీజేపీ ప్రభుత్వ హయాంలో యూపీలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని వ్యాఖ్య
- బ్రహ్మోస్ క్షిపణుల ధాటికి పాకిస్థాన్ మొకరిల్లాల్సి వచ్చిందన్న షా



## విఘ్నేశ్వరా వెళ్లి రావయ్యా



- గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు
- 11 రోజుల పాటు భక్తులతో విశేష పూజలందుకున్న ఖైరతాబాద్ గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వినాయక నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది
- ఈ మహాగణపతిని కడసారి దర్శించుకునేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు.



## బీజేపీ సాకులు చెప్పడం ఆపేయాలి

- 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు
- ఎస్ఐఆర్ వివాదంపై బీజేపీ సాకులు చెప్పడం ఆపేయాలి
- ఈ సమస్యను కేవలం ఒక రాజకీయ ఆరోపణగా కొట్టిపారేయలేం

## అహ్మదాబాద్‌లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట



- వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు
- గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట కొనసాగిస్తున్నారు
- పెట్టుబడుల అవకాశాలపై ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ
- అహ్మదాబాద్ వేదికగా పారిశ్రామిక భాగస్వామ్యాలకు కొత్త బాట పడింది.
- కాకినాడలో బహుముఖ పారిశ్రామిక పార్కు

అమరావతి

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. క్లీన్ ఎనర్జీ నుంచి ఫార్మా, ఇండస్ట్రియల్ పార్కులు, ఎడిబుల్ ఆయిల్స్, టైర్ల తయారీ వరకు ఏపీని కొత్త పెట్టుబడుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు. టోరెంట్, వెల్స్‌పన్, గోకుల్ ఆగ్రోస్, చిరిపాల్ గ్రూపులతో జరిగిన వరుస భేటీల్లో భారీ విస్తరణలకు రాష్ట్రాన్ని ఎంచుకోవాలని ఆహ్వానించారు. పెట్టుబడుల అవకాశాలపై ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇవ్వడంతో

వివరాలు 2లో..

## సహాయకచర్యలు వేగవంతం చేయాలి

- వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన
- భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలి
- ఉన్నతాధికారులు, పార్వతీపురం మన్యం, కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్
- పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.



# ఉత్తరాంధ్రలో వరద నష్టం

-మొదటిపేజీ తరువాయి



ఏజెన్సీ ప్రజలు నిత్యావసరాల కోసం ప్రమాదకర ప్రయాణాలు చేసి. వాగులు దాటుతున్నారు. ముంచంగిపుట్టు మండలం కర్లపొదురు వాగు దాటుతూ ఓ వ్యక్తి కొట్టుకుపోతూ చివరకు కర్ర సాయంతో ఒడ్డుకు చేరుకున్నాడు. ఏజెన్సీలోని చాలా గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. పోలవరం జిల్లా రంపచోడవరం ఏజెన్సీలో కొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

పందిరిమామిడి, రంప గ్రామాలకు వెళ్లే దారిలో వంతెనలపై నుంచి వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచాయి. చింతపల్లి మండలం కుడుముసార పంచాయతీ బోడజువి ప్రాథమిక పాఠశాల గోడ కూలింది. సెలవు కావడం వల్ల ప్రమాదం తప్పింది. భూపతిపాలెం, ముసురుమిల్లి, మద్దిగడ్డ, సూరంపాలెం జలాశయాలు నిండుకుండలా మారాయి. రంపచోడవరం నుంచి మారేడుమిల్లి వెళ్లే ప్రధాన రహదారిలో భూపతిపాలెం జలాశయం వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆంధ్ర-ఒడిశా ఉమ్మడి నిర్వహణలోని డుడుమ జలాశయం రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. జోలాపుట్ ప్రధాన జలాశయం నిండుకుండలా మారింది.

### నేలకొరిగిన అరటి తోట

విజయనగరం జిల్లా అరసాడ వద్ద రాజాం-వంగర మండలాలకు వెళ్లే ప్రధాన రహదారి వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. 50 గ్రామాలకు రాకపోకలు నిలిచి అవస్థలు పడుతున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న, చెరుకు పంటలు నీటమునిగాయి. వేగావతి నది ఉద్ధృతికి పలుచోట్ల రాకపోకలు నిలిచాయి. బొబ్బిలి గిరిజన బాలికల సంక్షేమ హాస్టల్‌కు వెళ్లే దారి కోతకు గురై విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తెర్లాం మండలంలో ముంపునకు గురైన పంటల్ని ఎమ్మెల్యే బేబి నాయన, చీపురుపల్లి నియోజకవర్గంలో నేలకొరిగిన అరటి తోటను ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు పరిశీలించారు. విజయనగరం జిల్లాలోని తోటపల్లి, మడ్డువలస జలాశయాల నుంచి నీటిని విడుదల చేయడంతో నాగావళి ఉగ్రరూపం దాల్చి నదీ పరివాహ గ్రామాల్ని చుట్టుముట్టింది. గంట్యాడ మండలం చంద్రంపేట-వసంత గ్రామాల మధ్య రహదారిపై ఉన్న బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తోంది.

### ఆక్రమణల్ని తొలగించి

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలంలో 5 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అన్నవరం గ్రామానికి వెళ్లే రోడ్డుపై 4 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. అధికారులు గ్రామస్తులకు ఆహార పొట్లాలు, తాగునీటి సరఫరా చేశారు. అన్నవరంలో నిండు గర్భిణీని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ముందు జాగ్రత్తగా పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. చెరుకుపల్లి గెడ్డ పొంగి సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌ను చుట్టుముట్టింది. సాలూరులో ముంపు ప్రాంతాలను మంత్రి సంధ్యారాణి పరిశీలించారు. కాలువలకు అడ్డుగా ఉన్న ఆక్రమణల్ని తొలగించి నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 15 మండలాలకు గాను 10 మండలాల్లో ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయి. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు 11 వందల 91 హెక్టార్లలో నీట మునిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

### వాగులు ఉప్పొంగడంతో

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వాగులు, గెడ్డలు ఉప్పొంగడంతో బహుదా నదికి వరద పోటెత్తింది. సుమారు 35 వేల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేశారు. లోతట్టు ప్రాంత ప్రజల్ని అధికారులు ముందస్తుగా పునరావాస శిబిరానికి తరలించారు. ఇన్నేసుపేట వద్ద పద్మనాభపురం గెడ్డ ఉద్ధృతికి పొలాలు నీటమునిగాయి. ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాల్లో నాగావళి, వంశధార నదులు ఉరకలేస్తున్నాయి.

### వెయ్యేకరాల పంట ముంపునకు

చెవ్వకులపేట, ఆనందపురం, పొన్నంపేట, శైలాడ, రామచంద్రపురం ప్రాంతాల్లో వెయ్యేకరాల పంట ముంపునకు గురైంది. బూర్జ మండలంలోని పనుకుపర్తి, అల్లిన గ్రామాలను నాగావళి వరద చుట్టుముట్టింది. ఎమ్మెల్యే కూన రవి, కలెక్టర్, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ముంపు గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలపై భరోసా ఇచ్చారు. వంశధార ప్రవాహం పెరగడంతో గొట్టా బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

### వాహనదారుల ఇక్కట్లు

గోస్తనీ గేట్ నుంచి విశాఖ వెళ్లే సర్వీస్ రోడ్డులో వర్షం నీరు నిలిచి వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. విశాఖ జిల్లా గాజువాక, యారాడ సముద్ర తీరంలో వానలు, గాలుల ధాటికి వందల ఎకరాల్లో అరటి తోట నేలకొరిగింది. కొబ్బరి తోటలకూ తీవ్ర నష్టం వాటిల్లింది. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో తాండవ నదికి వరద పోటెత్తుతోంది.

# అహ్మదాబాద్‌లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట

-మొదటిపేజీ తరువాయి



అహ్మదాబాద్ వేదికగా పారిశ్రామిక భాగస్వామ్యాలకు కొత్త బాట పడింది.

అహ్మదాబాద్ పర్యటనలో భాగంగా మంత్రి నారా లోకేశ్ వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహిస్తూ సుడిగాలి పర్యటన చేపట్టారు. టోరెంట్ గ్రూప్ ఛైర్మన్ సమీర్ మెహతా, డైరెక్టర్లు షాన్ మెహతా, జిగీష్ మెహతాలతో జరిగిన చర్చల్లో ఫార్మా రంగంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వైజాగ్ ప్లాంట్ బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్‌లో భాగంగా ఏపీఐలు, అధునాతన ఇంటర్మీడియట్ల తయారీ సామర్థ్యాలను విస్తరించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సౌర, పవన, హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టులకు కూడా ఏపీ అవకాశాలను వివరించారు. ఎనర్జీ స్టోరేజ్, గ్రీన్ మాలిక్యూల్స్ రంగాల్లో టోరెంట్ పవర్ విస్తరణ ప్రణాళికలకు అనుగుణంగా పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను రాష్ట్రంలో చేపట్టాలని సూచించారు. కంపెనీ విస్తరణ ప్రణాళికలను సమీర్ మెహతా లోకేశ్?కు వివరించారు. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని చేరుకోవడమే లక్ష్యమని ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఛైర్మన్ సమీర్ మెహతా వెల్లడించారు.

### కాకినాడలో బహుముఖ పారిశ్రామిక పార్కు

వెల్స్‌పన్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో చర్చల్లో కాకినాడలో బహుముఖ పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు లోకేశ్ ప్రతిపాదన పెట్టారు. టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, డీఐ పైపుల తయారీ, పైపు కోటింగ్, గ్రీన్ అమోనియా యూనిట్లను ఒకే వేదికపై ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా ఆహ్వానించారు. గత ఏడాది దావోస్‌లో చంద్రబాబుతో జరిగిన చర్చల్లో వచ్చిన ప్రతిపాదనల పురోగతిని ఇరువురు సమీక్షించారు. వెల్స్‌పన్ గ్రూప్ ఇప్పటికే రాష్ట్రంలో చేపట్టిన కార్యకలాపాలను నితిన్ జైన్ వివరించారు. కర్నూలు, కడప జిల్లాల్లో 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును సంస్థ నిర్వహిస్తోందన్నారు. కాకినాడ--శ్రీకాకుళం గ్యాస్ పైప్‌లైన్ కోసం ఏపీజీడీసీకి, రిలయన్స్ కేజీ-డీ6 ప్రాజెక్టుకు పైపులను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

### విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ యూనిట్

గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కనుభాయ్ జె.ఠక్కర్‌తో భేటీలో నెల్లూరులోని ప్రస్తుత ప్లాంట్ విస్తరణకు ప్రతిపాదన వచ్చింది. పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీలను ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. కృష్ణపట్నంలో రోజుకు 1,400 టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన వంటనూనె రిఫైనరీ 2024 నుంచి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తోందని కనుభాయ్ ఠక్కర్ తెలిపారు. కాండ్ల, కృష్ణపట్నం, హల్దియా, మంగుళూరులో సంస్థకు ప్లాంట్లు ఉన్నాయని దక్షిణాది మార్కెట్ల కోసం మరింత విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. చిరిపాల్ గ్రూప్ ఎండీ బ్రిజ్ మోహన్ చిరిపాల్, గ్రూ సోలార్ సీఈఓ వినయ్ థదానితో జరిగిన సమావేశంలో విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ యూనిట్‌పై చర్చించారు. మౌలిక వసతులు, రోడ్డు కనెక్టివిటీ, విధానపరమైన మద్దతు వంటి అంశాలను లోకేశ్ వివరించారు. విశాఖలో పారిశ్రామిక ప్రాజెక్టులకు ఉన్న అనుకూలతలను తెలియజేస్తూ పెట్టుబడికి ఆహ్వానించారు. టైర్ల తయారీ యూనిట్‌పై ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని బ్రిజ్ మోహన్ చిరిపాల్ తెలిపారు.

### 52 దేశాలకుపైగా ఉత్పత్తులు

చిరిపాల్ గ్రూప్ కార్యకలాపాల విస్తృతిని బ్రిజ్ మోహన్ వివరించారు. నందన్ డెనిమ్, విశాల్ ఫ్యాబ్రిక్స్, నందన్ టెర్రీ వంటి వస్త్ర ఉత్పత్తులతో పాటు చిరిపాల్ పాలీఫిల్మ్స్, గ్రూ సోలార్, రసాయన ఉత్పత్తులను సంస్థ ఎగుమతి చేస్తోందన్నారు. 52కుపైగా దేశాలకు తమ ఉత్పత్తులు చేరుతున్నాయని తెలిపారు. తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, జమ్మూ-కశ్మీర్‌లో ఇప్పటికే తయారీ యూనిట్లు ఉన్నాయని వెల్లడించారు.

# నలుగురు జెన్‌జీలకు కోటంరెడ్డి టిక్కెట్లు

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త నాయకత్వానికి బాటలు వేసే దిశగా అధికార కూటమి వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. రాజకీయాల్లో పేరుకుపోయిన సంప్రదాయ మూస ధోరణిని బద్దలు కొడుతూ, డిజిటల్ యుగంలో పెరిగిన జెన్ జీ యువతను ప్రత్యక్ష ప్రజా జీవితంలోకి ఆహ్వానించాలన్న సరికొత్త కాన్సెప్ట్‌ను తెరపైకి తెస్తోంది. తలలు పండిన తర్వాతే ప్రత్యక్ష ఎన్నికల్లోకి రావాలన్న పాతకాలపు నిబంధనలను పక్కనపెట్టి, సమాజం పట్ల బాధ్యత, సామాజిక చైతన్యం, యువ రక్తంలో ఉన్న ఫైర్‌ను గుర్తించి వారిని కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా నిలబెట్టేందుకు క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసింది. ఈ విప్లవాత్మక మార్పునకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయం ఒక బలమైన నాందిగా నిలిచింది. తన నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థ డివిజన్లలో నలుగురు యువ జెన్ జీ అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయించడమే కాకుండా, వారి ఎన్నికల ఖర్చు మొత్తాన్ని తానే స్వయంగా భరిస్తానని ఆయన ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. రాజకీయాలంటే కేవలం ధనబలం, కుల సమీకరణాలు, పాతతరం నేతలకే పరిమితం కాదనే స్పష్టమైన సందేశాన్ని ఇది ప్రజల్లోకి పంపింది. ఇదే మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కీలక నగరాలు, మేజర్ మున్సిపాలిటీల్లో అమలు చేసి, విద్యావంతులైన యువతను రాజకీయాల్లోకి లాగాలని కూటమి పెద్దలు భావిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ఓటరు నాడిని పరిశీలిస్తే.. సాంకేతికత, ఆధునిక ఆలోచనలు, వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే నాయకత్వాన్నే నేటి తరం కోరుకుంటోంది. సోషల్ మీడియా ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే యువతీయువకులు పాలనా వ్యవస్థలో భాగస్వాములయితే స్థానిక సంస్థల పనితీరు సమూలంగా మారుతుందని కూటమి విశ్లేషిస్తోంది. ఈ సరికొత్త ప్రయోగం వెనుక ఉన్న అసలు రాజకీయ లక్ష్యం భవిష్యత్ నాయకత్వ నిర్మాణం . టీడీపీ, జనసేన శ్రేణుల్లో రాబోయే రెండు మూడు దశాబ్దాల రాజకీయాలను శాసించగల బలమైన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ఈ మున్సిపల్ పోరు నుంచే తయారు చేయాలని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో వార్డు, డివిజన్ స్థాయి నుంచే ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులను తీర్చిదిద్దడం వల్ల పార్టీల సంస్థాగత పునాదులు మరింత పటిష్టమవుతాయని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీల బలపరీక్షగానే కాకుండా.. సంప్రదాయ పాతతరం రాజకీయాలకు, ఆవేశం-ఆలోచన కలగలిసిన కొత్తతరం ఆలోచనలకు మధ్య జరిగే పరివర్తనగా మారనున్నాయి. యువతకు టిక్కెట్లు ఇవ్వడంతో పాటు వారిని గెలిపించుకోగలిగితే, ఏపీ రాజకీయాల్లో ఇదొక సువర్ణ అధ్యాయంగా మిగిలిపోనుంది. ఒకప్పుడు రాజకీయాలంటే భయపడి దూరంగా ఉన్న విద్యావంతులైన యువత, నేడు స్థానిక పాలనను తమ చేతుల్లోకి తీసుకునేందుకు సిద్ధమవుతుండటం రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు శుభపరిణామం అవుతుందనడంలో సందేహం లేదు.

## విఘ్నేశ్వరా వెళ్లి రావయ్యా

అశేష భక్త వాహిని జయజయధ్వానాల మధ్య ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసింది. 11 రోజుల పాటు భక్తులతో ధూపదీప నైవేద్యాలందుకున్న ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరుకున్నాడు. ఈ క్రతువును చూసేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో హైదరాబాద్? నగరం జనసంద్రంగా మారింది. తొలుత బాహుబలి క్రేన్‌లో సాంకేతిక లోపంతో బడా గణేశ్? టస్కర్‌పైకి ఆలస్యంగా చేరాడు. ఉదయం 6 గంటలకు ప్రారంభం కావాల్సిన శోభాయాత్ర, క్రేన్?లో సమస్య కారణంగా 3 గంటల ఆలస్యంగా 9 గంటలకు ప్రారంభమైంది. 'జై బోలో గణేశ్? మహరాజ్ ?కీ జై' అంటూ భక్తుల జయజయధ్వానాలు మార్మోగాయి. అశేష భక్తజనావళి నినాదాల మధ్య ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరాడు. బడా గణేశ్ శోభాయాత్ర ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. భక్తుల కోలాహలం మధ్య సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర ట్యాంక్?బండ్ క్రేన్? 4 వద్దకు చేరుకుంది. భక్తులు గణనాథుడిపైకి పుష్పాలు చల్లుతూ, డోలు వాయిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఆ గణనాథుని కడసారి చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. దారి పొడవునా జై బోలో గణేశ్ మహరాజ్ కీ అంటూ నీరాజనాలు పలికారు. సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్క నుంచి సచివాలయం మీదుగా సాగర తీరానికి గణేశుడు చేరుకున్నాడు. నిమజ్జనాల సందర్భంగా హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

### భారీ భద్రతా వలయంలో హైదరాబాద్

గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. నగరాన్ని భారీ భద్రతా వలయంలోకి తీసుకొచ్చారు. 20 వేల మందికి పైగా సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను రంగంలోకి దించారు. ఇక మహా నిమజ్జన శోభాయాత్రను క్షణక్షణం పర్యవేక్షించేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ అత్యాధునిక సాంకేతికతను వినియోగించింది. 10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లు, హైరైజ్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది.

## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ

ఖరీఫ్ 2026-27కు సంబంధించి ధాన్యం సేకరణను నవంబర్ 1 నుంచి చేపట్టనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియచేశారు. ప్రస్తుత ఖరీఫ్?లో దాదాపు 37లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్లు మంత్రి చెప్పారు. విజయవాడలోని ఆంత్రాక్స్ ఎక్స్ కన్వెన్షన్ హాల్?లో ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణ సన్నద్ధతపై కార్యశాల జరిగింది.

### ముఖ్య అతిధిగా మంత్రి నాదెండ్ల మనోహర్

పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారులు, సంయుక్త కలెక్టర్లు, రైస్ మిల్లర్లతో పౌర సరఫరాల శాఖ నిర్వహించిన ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల కార్యశాలకు మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, వ్యవసాయశాఖ డైరెక్టర్ మనాజిర్ జీలాని సమూన్, ఏపీఎస్‌సీఎస్‌సీఎల్ ఛైర్మన్ సుధీర్, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. పీ.వీ సత్యనారాయణ, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ నుపూర్ అజయ్ కుమార్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా 2,619 కొనుగోలు కేంద్రాలు

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ ఖరీఫ్‌లో దాదాపు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,619 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ కోసం దాదాపు 24,000 మంది సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలియచేశారు. సేకరణ ప్రక్రియ నిమిత్తం 6 కోట్ల 10 లక్షల గన్నీ బ్యాగుల సిద్ధం చేశామన్నారు. ధాన్యం రవాణా కోసం జీపీఎస్ అమర్చిన సుమారు 31 వేల వాహనాలను వినియోగించనున్నామన్నారు.

" ధాన్యం కొనుగోలు సన్నద్ధతపైన పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొనడం జరిగింది. ధాన్యం సేకరణకు 24 వేల మంది సిబ్బందిని నియమించి 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎల్‌నినో ప్రభావంతో ధాన్యం సేకరణ అంచనా తగ్గింది. ఖరీఫ్ ధాన్యం సేకరణకు 2,619 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం రవాణాకు 31 వేల వాహనాలు అందుబాటులో ఉంచుతాం. ఈ ఏడాది రైతులకు రవాణా ఖర్చులు చెల్లించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం."

### నేరుగా రైతుల ఖాతాల్లోకి

దేశంలోనే తొలిసారిగా ధాన్యం కొనుగోలుతో పాటే నేరుగా రైతుల ఖాతాల్లోకి రవాణా ఛార్జీలను జమ చేసే సంస్కరణలను ఈ ఖరీఫ్?లో అమలు చేస్తున్నామని మంత్రి అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా మిల్లర్లు, అధికారులు పూర్తి సమన్వయంతో, జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించామని మంత్రి తెలిపారు. ఎల్-నినో ప్రభావం వల్ల గతంలో కోటి 60 లక్షల టన్నులుగా ఉన్న అంచనా కోటి 10 లక్షల టన్నులకు తగ్గిందని, ప్రస్తుత వర్షాల ఆధారంగా అవసరమైతే కేంద్రంతో మాట్లాడి ధాన్యం సేకరణ లక్ష్యంలో మార్పులు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియచేశారు.

## సహాయకచర్యలు వేగవంతం చేయాలి



రాష్ట్రంలో తీవ్ర వాయుగుండం, భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక, పునరుద్ధరణ చర్యలను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నతాధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించారు. వడ్డివాడ, అంట్లవరం, వడ్డితాండ్ర, సంతబొమ్మాళి గ్రామాల్లో ముంపు ప్రాంతాలను, వరద నీటిలో మునిగిన పంట పొలాలను మంత్రి స్వయంగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి పంట నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గొదలాం, కొల్లిపాడు, లక్కివలస, మరువాడ, మేఘవరం గ్రామాల్లోనూ పర్యటించి వరద ముంపు పరిస్థితులను పరిశీలించారు. పార్వతీపురం మన్యం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి గురువారం ఉన్నత స్థాయి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వరదల కారణంగా రైతులకు జరిగిన పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పంట నష్టం, మౌలిక వసతుల పునరుద్ధరణ, నీటి నిల్వ సామర్థ్యంపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

### తక్షణ పంట నష్టం అంచనా

వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టంపై క్షేత్రస్థాయిలో తక్షణమే సర్వే చేపట్టి, ఎన్యూమరేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి.

రైతులకు సాంకేతిక సలహాలు: పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలి. అధికారులు స్వయంగా పొలాలను సందర్శించి, పంటల సంరక్షణకు సంబంధించి రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందించాలి.

రహదారుల మరమ్మతులు: వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, మౌలిక వసతుల నష్టాన్ని అంచనా వేయాలి. ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా అత్యవసర రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి.

వర్షపు నీటి సంరక్షణ: కురుస్తున్న భారీ వర్షాల నీటిని వృథా కానివ్వకుండా చెరువులు, జలాశయాల్లో సాధ్యమైనంత మేర నిల్వ చేయాలి. భవిష్యత్తులో సాగు, తాగునీటి అవసరాలకు ఈ నీటిని వినియోగించుకునేలా పక్కా ప్రణాళిక రూపొందించాలి.

శాఖల సమన్వయం: వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నష్టపోయిన రైతాంగానికి తక్షణ సహాయం అందించాలి. ఈ కష్టసమయంలో ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, క్షేత్రస్థాయిలో సహాయక చర్యల్లో ఎలాంటి అలసత్వం వహించినా సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు.

## మున్సిపల్, జిల్లా ట్రెజరీ కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్.






**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:** పట్టణం లోని మున్సిపల్ కార్యాలయ భవనం, జిల్లా ట్రెజరీ కార్యాలయాలను శుక్రవారం ఉదయం క్షేత్రస్థాయిలో సమగ్రంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆకస్మికంగా పరిశీలించారు. మొదటగా శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తో కలసి మున్సిపల్ కార్యాలయ ప్రాంగణాన్ని చేరుకున్న జిల్లా కలెక్టర్ భవనం యొక్క ప్రస్తుత పరిస్థితి, స్థలం విస్తీర్ణం, దానిని ప్రజలకు ఉపయోగకరంగా ఎలా మార్చవచ్చనే అంశాల పై సంబంధిత ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన ఆస్తులను రక్షించడం, వాటిని ప్రజల ప్రయోజనాల కోసం సమర్థవంతంగా వినియోగించడం తమ ప్రాధాన్యత అని తెలిపారు. భవనం యొక్క దృఢత్వాన్ని ఇంజనీరింగ్ అధికారుల ద్వారా పరీక్షించి, పునరుద్ధరణ సాధ్యమవుతుందా లేదా అనే అంశం పై వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం లేకుండా తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టి ప్రాంగణాన్ని శుభ్రపరచాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ స్థలం ఆక్రమణకు గురికాకుండా సరిహద్దులను సరిచూసి, అవసర మైన చోట రక్షణ గోడ లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ సదుపాయం లాంటి పబ్లిక్ ప్రాజెక్ట్ కోసం వినియోగించేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పాత ట్రెజరీ భవనాన్ని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తో కలసి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. భవన నిర్మాణం, రికార్డుల భద్రత, ప్రస్తుత స్థితిగతులు, ప్రాంగణ నిర్వహణ పై అధికారులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాత ట్రెజరీ భవన ప్రాంగణాన్ని, ముఖ్య మైన ప్రభుత్వ రికార్డులను సురక్షితంగా కాపాడు కోవాల్సిన బాధ్యత మన పై ఉందన్నారు. భవనం ప్రస్తుత స్థితిగతులను పరిశీలించి, అవసర మైన పునరుద్ధరణ పనులు చేపట్టి, ఈ స్థలాన్ని ప్రజావసరాలకు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా నూతన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం ప్రారంభం....

**వైద్యశాల భవనాన్ని ప్రారంభించిన బండారు సత్యనారాయణ మూర్తి.**







**దేవరపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:**?ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ ద్వారా, ఎన్ఏఎం నిధులతో దేవరాపల్లి పిహెచ్సి ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఏంఎస్ఐడిసి)ద్వారా నిర్మించిన నూతన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనాన్ని మాడుగుల నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటు లోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రాథమిక ధ్యేయమని మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల.

?ఆయుర్వేదం వైద్యం మన దేశపు పురాతన, అత్యంత విశ్వసనీయ మైన వైద్య విధానమని, దుష్ప్రభావాలు లేని చికిత్స అందించడంలో ఇది ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా దేవరాపల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య పరీక్షలు, ఆయుర్వేద మందులు లభిస్తాయని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి ఆయుష్ ప్రాంతీయ ఉపసంచాలకులు డా. కె. శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా ఆయుష్ అధికారి డా. కె. లావణ్య,దేవరాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యధికారి డా. గ్రీష్మ, ?పిహెచ్సి వైద్యధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరి రక్షణలో పోలీసులే కీలకం మంత్రి సవిత.

- కష్టమొచ్చినా, భయం కలిగినా పోలీసుల కోసం చూస్తాం.
- ఖాకీ డ్రెస్ ది సేవతో కూడిన ఉద్యోగం.
- ఆధునిక పరి జ్ఞానంతో కూడిన శిక్షణతో నేరాలకు అడ్డుకట్ట.
- ఏటా పోలీసు ఉద్యోగాల భర్తీ.
- పోలీసుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం మంత్రి సవిత.
- ఘనంగా జంతులూరు లోని 14 వ బెటాలియన్ లో పాసింగ్ అవుట్ పెరేడ్.








**అనంతపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:** శాంతి భద్రతల పరి రక్షణలో పోలీసుల పాత్ర కీలకమని, వారి సేవలు సమాజానికి ఆదర్శమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. పోలీసుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రతి ఏటా పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తామని వెల్లడించారు. శుక్రవారం బుక్కరాయసముద్రం మండలం, జంతులూరు లోని 14 వ బెటాలియన్ నందు ఏపీఎస్పీఎస్ సీటీపీసీ 2025-26 బ్యాచ్ కు చెందిన 187 మంది శిక్షణార్థుల పాసింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం బాధ్యతాయుత మైనదన్నారు. పగలు-రాత్రి, ఎండ-వాన తేడా లేకుండా విధులు నిర్వర్తించడం పోలీసుల నిత్యజీవితంలో భాగమన్నారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడుతూ, ప్రజలకు రక్షణకు రేయింబవళ్లు కృషి చేస్తుంటారన్నారు. పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేస్తూ పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజల సమస్యలను ఓర్పుతో విని, వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి విధానం అభినందనీయమన్నారు. ఏక్కడ సమాజం ప్రశాంతంగా నిద్రపోతుందో అక్కడ పోలీస్ వ్యవస్థ బలంగా ఉన్నట్లు అర్థమన్నారు. కష్టం వచ్చినా, భయం వచ్చినా, పండగలు వచ్చిన ప్రజలు పోలీసుల కోసం చూస్తారన్నారు. పక్కన పోలీసు ఉంటే ప్రశాంతంగా గుండెల మీద చెయ్యి వేసుకుని కాలం గడుపుతామన్నారు. ఇది పోలీసుల పై ప్రజలకు ఉన్న నమ్మకమన్నారు. ఖాకీ డ్రెస్ ఉద్యోగం బాధ్యాయుతమైనదని, ఏ ఉద్యోగాని కైనా ఒక టైమ్ ఉంటుందని, పోలీసులు మాత్రం ఎప్పుడూ 24 గంటలు ఉద్యోగంలోనే ఉంటారని మంత్రి సవిత కొనియాడారు.

**ఏటా పోలీసు ఉద్యోగాల భర్తీ.**

ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఆ క్యాలెండర్ లో భాగంగా పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తామని మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే 6,100 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. త్వరలో 2,050 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయనున్నామన్నారు. తమది ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తోందని మంత్రి సవిత తెలిపారు.

**పోలీసుల సంక్షేమానికి పెద్దపీట.**

పోలీసుల సంక్షేమానికి, భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సవిత తెలిపారు. 2026-27 బడ్జెట్లో రూ.9,165 కోట్ల నిధులను కేటాయించామన్నారు. కానిస్టేబుల్ నుంచి డీజీపీ స్థాయి అధికారి వరకు రూ.20 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు బీమా కవరేజ్ ఇస్తున్నామన్నారు. పోలీసులకు టీఏ,డీఏ మెడికల్ రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తున్నామన్నారు. ఈ నెలలోనే రెండు డిఏ లు కూడా చెల్లించామని తెలిపారు. గతంలో శిక్షణా సమయంలో ట్రైనీ కానిస్టేబుళ్లకు రూ.4,500 ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం రాగానే స్టైఫండ్ ను ఏకంగా రూ.12 వేలకు పెంచామని మంత్రి సవిత తెలిపారు.

**స్మార్ట్ పోలీసులుగా ఎదగండి...**

పోలీసు సేవ అనేది అధికారాన్ని ప్రదర్శించే వేదిక కాదని, అది బాధ్యతను నిర్వర్తించే అవకాశమని మంత్రి సవిత తెలిపారు. ప్రతి పౌరుడూ కష్టకాలంలో ఆశ్రయించే సంస్థ పోలీసు శాఖ అని, కొత్తగా విధుల్లోకి చేరుతున్నవారిలో మానవత్వం,

నిష్పాక్షికత, నిర్ణయాలలో న్యాయం ప్రతిబింబించాలన్నారు. నేటి ప్రపంచం వేగంగా మారుతోందని, సాధారణ నేరాలతో పాటు సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, డిజిటల్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇచ్చిన ఆధునిక శిక్షణను సద్వినియోగం చేసుకుని, స్మార్ట్ పోలీసులుగా ఎదగాలని మంత్రి సవిత ఆకాంక్షించారు. పోలీసు విధుల్లోకి చేరుతున్న కానిస్టేబుళ్లకు, వారి తల్లిదండ్రులకు మంత్రి సవిత అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఇతర పోలీసు అధికారులు, శిక్షణ పొందని కానిస్టేబుళ్లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలకు మెరుగైన సేవలు

## అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి సవిత.









**శింగనమల, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. శింగనమల నియోజకవర్గంలో రేకులకుంటలో స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తో కలిసి మంత్రి సవిత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం లోని వసతులు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, ఇతర సదుపాయాలను మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందితో మాట్లాడి కేంద్రంలో పిల్లలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. గర్భిణీలకు సాంప్రదాయ బద్ధంగా శ్రీమంతం కార్యక్రమం నిర్వహించి ఆశీర్వదించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి స్వయంగా అన్నప్రాసన చేయించారు. గర్భిణీలు, చిన్నారులతో మంత్రి ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి, చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, కూటమి నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన హోం మంత్రి అనిత







పాయకరావుపేట, పెన్ సత్తా, సెప్టెంబర్ 25: పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు హోం మంత్రి వంగలపూడి అనిత అందజేశారు. నియోజకవర్గ పరిధి లోని నాలుగు మండలాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులు అందజేశారు. 52 మందికి గాను 29,17,219 రూపాయల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, అనారోగ్యం లేదా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగంగా నిలుస్తుందని అన్నారు. ఎన్డిఏ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నేను మంత్రి అవుతా'.. నందిని!

- మెడికల్ కాలేజీ తెస్తామన్నారు.. అది ఏమైంది?.
- మంత్రి సత్యకుమార్ ను నేరుగా ప్రశ్నించిన 9 వ తరగతి బాలిక రమణమ్మ.
- ఏదైనా అడగండి.. స్వేచ్ఛగా మాట్లాడండి మంత్రి.
- బాలికలతో చనువుగా ముచ్చటించిన మంత్రి సత్యకుమార్.
- పాఠశాల వసతులు, చేనేత, ధర్మవరం అభివృద్ధి పై బాలికల ప్రశ్నలు.
- విద్యార్థినుల చొరవకు మంత్రి, అధికారుల ప్రశంసలు.







**ధర్మవరం, పెన్ సత్తా, సెప్టెంబరు 25:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ధర్మవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమం మంత్రి సత్యకుమార్ యాదవ్, విద్యార్థినుల మధ్య సాగిన ముఖాముఖితో ప్రత్యేకంగా నిలిచింది. కార్యక్రమంలో నేను మీకు ప్రసంగం చెప్పడానికి మాత్రమే రాలేదు.. మీతో మాట్లాడటానికి వచ్చాను. మీకు ఏమైనా ప్రశ్నలు ఉంటే స్వేచ్ఛగా అడగండి అని మంత్రి చెప్పడంతో బాలికలు ఒక్కొక్కరుగా ప్రశ్నలు అడిగారు. తమ భవిష్యత్ లక్ష్యాల నుంచి మెడికల్ కాలేజీ, చేనేత కుటుంబాలు, పాఠశాల వసతులు, పరిసరాల పరిశుభ్రత వరకు పలు అంశాలను నేరుగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మీరు భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారు?' అని మంత్రి ప్రశ్నించగా.. కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, టీచర్ అవుతామని చెప్పారు. ఏడో తరగతి చదువుతున్న నందిని చేయి ఎత్తి నేను మంత్రి అవుతాను అని చెప్పింది.. దీంతో మంత్రి ఆమెను దగ్గరకు పిలిచి.. మంత్రి అయ్యి ఏం చేస్తావు? అని అడిగారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తానని నందిని చెప్పింది. "ఎందుకు మంత్రి కావాలనిపించింది? ఎవరిని చూసి ఈ ఆలోచన వచ్చింది?" అని మంత్రి ప్రశ్నించారు. ధర్మవరంలో ప్రస్తుతం ఒక ఎమ్మెల్యే ఉన్నారు కదా. నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నాను. నువ్వు మంత్రి కావాలంటే ముందుగా ఎమ్మెల్యే కావాలి' అన్నారు. "నువ్వు ఎమ్మెల్యేగా పోటీ చేసే వయసుకు వచ్చే వరకు నా ఎమ్మెల్యే గిరి, మంత్రిపదవి 'సేఫ్' అంటూ నవ్వించారు.

**మెడికల్ కాలేజీ తెస్తామన్నారు.. అది ఏమైంది?'...**

9 వ తరగతి విద్యార్థిని వెంకట రమణమ్మ నేరుగా మంత్రి వద్దకు వచ్చి.. "సార్.. ధర్మవరం అభివృద్ధి కోసం మీరు ఎంతో కృషి చేస్తున్నారు. ధర్మవరానికి మెడికల్ కాలేజీ తీసుకొస్తానని చెప్పారు. మెడికల్ కాలేజీ తెస్తామన్నారు.. అది ఏమైంది? మేమంతా ఎదురుచూస్తున్నాం" అని ప్రశ్నించింది. వెంటనే స్పందించిన మంత్రి.. అమ్మా.. నేను చెప్పాను కదా.. చేసేశాను కూడా అని అన్నారు. ధర్మవరానికి ఆయుర్వేద వైద్య కళాశాల ఇప్పటికే మంజూరైందని తెలిపారు. టెండర్ల ప్రక్రియ జరుగుతోందని, త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

వెంకట రమణమ్మ ప్రశ్నను మంత్రి అభినందించారు. మంచి ప్రశ్న అడిగావు, నువ్వు ఏం అడుగుతావోనని కొంచెం భయపడ్డాను. కానీ ఇప్పటికే మంజూరు చేసేశాం కాబట్టి నాకు టెన్షన్ లేదు అంటూ సరదాగా స్పందించారు.

**చేనేత కుటుంబాల కోసం ఏం చేశారు?'...**

మరో విద్యార్థిని ధర్మవరం లోని చేనేత కార్మికుల గురించి ప్రశ్నించింది. "చేనేత కార్మికుల కోసం ఎంతో కృషి చేశారు. ఆరోగ్యం గురించి కూడా చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. మా కోసం ఇంత దూరం వచ్చారు. ఇన్ని పనులు చేయడానికి మీకు సమయం ఎలా దొరుకుతుంది?" అని అడిగింది. దీనికి మంత్రి స్పందిస్తూ.. ఎన్నికల సమయంలో చేనేత కార్మికుల కోసం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ తీసుకొస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చామని తెలిపారు. దేశంలో ఒకే మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ మంజూరైతే అది ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిందని, ఆ క్లస్టర్ ధర్మవరానికి రావడం విశేషమన్నారు.

**మా తల్లిదండ్రుల వద్ద మొబైల్ ఉండదు.. ట్యాబ్లెట్లు కావాలి'...**

విద్యార్థుల అవసరాలను అడుగుతున్న సమయంలో ఓ బాలిక.. మా తల్లిదండ్రుల వద్ద మొబైల్ ఫోన్లు ఉండవు. చదువుకోవడానికి ట్యాబ్లెట్లు అవసరం అని చెప్పింది. దీని పై మంత్రి వెంటనే స్పందించారు. పాఠశాలలో ఉన్న ట్యాబ్లెట్లను నిజంగా అవసర మైన విద్యార్థులకు అందించాలని తన సిబ్బందికి సూచించారు.

**మరుగుదొడ్ల ఏర్పాటుకు హామీ...**

మా స్కూల్లో 552 మంది విద్యార్థినులం ఉన్నాం. మాకు 15 నిమిషాల బ్రేక్ ఉంటుంది. ఆ సమయంలో వాష్‌రూమ్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. మరుగుదొడ్ల సంఖ్య పెంచాలి అని సాహితి అనే విద్యార్థిని కోరింది. దీని పై మంత్రి సానుకూలంగా స్పందించారు. విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా మరుగుదొడ్ల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**స్కూల్ వెనుక చెత్త.. దుర్వాసన...**

పాఠశాల పరిసరాల పరిశుభ్రత పై మరో విద్యార్థిని ప్రశ్నించింది. స్కూల్ ప్రహరీ పక్కన ఉన్న గార్డెన్ ప్రాంతం నుంచి దుర్వాసన వస్తోందని, పాఠశాల వెనుక చెత్త పేరుకుపోయిందని తెలిపింది. దీని పై మంత్రి వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. రేపు ఉదయం మొదటి అవర్ లోనే మున్సిపాలిటీ సిబ్బంది రావాలి అని ఆదేశించారు.

**ఏదైనా అడగండి.. స్వేచ్ఛగా మాట్లాడండి..**

మరో బాలిక.. సార్.. మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలనుకుంటున్నాను అని చెప్పింది. అడుగు.. స్వేచ్ఛగా అడగొచ్చు. నా ఎమ్మెల్యే గిరి, సీటు, మంత్రి పదవి తప్ప ఏదైనా అడగొచ్చు అంటూ మంత్రి నవ్వించారు. మంత్రి చనువుగా మాట్లాడటంతో బాలికలు కూడా ఎలాంటి బెరుకు లేకుండా తమ ప్రశ్నలను ముందుకు తెచ్చారు. దీంతో కార్యక్రమం ప్రసంగానికి పరిమితం కాకుండా బాలికలతో నేరుగా సాగిన ముఖాముఖిగా మారింది. కార్యక్రమంలో బాలికల చొరవకు అధికారులు ప్రశంసలు ఇచ్చారు. పదో తరగతి లోపు చదువుతున్న బాలికలు తమ వయసుకు మించిన అవగాహనతో ప్రశ్నలు అడగడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాలలో మరుగుదొడ్లు కావాలని కోరడం, పరిసరాల్లో చెత్త, దుర్వాసన సమస్యను మంత్రి దృష్టికి తీసుకురావడం, చేనేత కుటుంబాల పరిస్థితి, ధర్మవరం అభివృద్ధి పై ప్రశ్నించడం వారి చొరవకు అద్దం పట్టింది. తమ సమస్యలను నేరుగా మంత్రికి వివరించి పరిష్కారం కోరిన బాలికల తీరు కార్యక్రమానికి హాజరైన అధికారులను ఆకట్టుకుంది. పదో తరగతిలోపు విద్యార్థినులు పాఠశాల సౌకర్యాల నుంచి ధర్మవరం అభివృద్ధి వరకు వివిధ అంశాల పై అవగాహనతో ప్రశ్నలు అడగడాన్ని చూసి అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా నందిని భవిష్యత్తులో మంత్రి అవుతానని ధైర్యంగా చెప్పడం, వెంకట రమణమ్మ మెడికల్ కాలేజీ పై నేరుగా ప్రశ్నించడం ప్రత్యేకంగా నిలిచాయి. బాలికల ప్రశ్నలకు మంత్రి చనువుగా, ఓపికగా సమాధానాలు ఇవ్వడంతో ముఖాముఖి ఆద్యంతం ఆసక్తికరంగా, ఆప్యాయంగా సాగింది. ముఖాముఖి అనంతరం మంత్రి విద్యార్థులకు జీవితంలో ఒక లక్ష్యాన్ని పెట్టుకుని దాని కోసం కష్టపడాలని సూచించారు. పోలీస్, డాక్టర్, ఇంజినీర్, న్యాయవాది, శాస్త్రవేత్త, టీచర్.. ఏ రంగాన్ని ఎంచుకున్నా పట్టుదలతో ముందుకు వెళ్లాలని చెప్పారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని, అప్పట్లో ఇప్పుడున్నన్ని సౌకర్యాలు తమకు లేవని తెలిపారు. అయినా కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. ధర్మవరం లోని ప్రతిభావంతు లైన విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ, వసతి కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. 25 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామని, గ్రూప్ చర్చలు, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ కూడా అందిస్తున్నామని చెప్పారు. చేనేత, దిగువ మధ్యతరగతి, బీసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిల్లల కలలు కలలుగానే మిగలకూడదన్నారు. ఒక్క విద్యార్థి అయినా ఐఏఎస్, ఐపీఎస్ స్థాయికి చేరుకుంటే తనకు ఎంతో సంతోషమని చెప్పారు. గ్రూప్-1, గ్రూప్-2, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించినా సంతోషమేనన్నారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు, డిఎంహెచ్వో ఫైరోజ్ బేగం, డిఇఓ కిష్టప్ప, ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ సుమన, తదితరులు పాల్గొన్నారు

# కష్టం సమయంలో ప్రజలకు ప్రభుత్వం తోడు..

- సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించిన మంత్రి సత్యకుమార్.
- ఆపద వేళ అండగా.. ఆరోగ్య కష్టాల్లో ఆర్థిక భరోసాగా సీఎంఆర్‌ఎఫ్..
- అనారోగ్య బాధితులకు ఆర్థిక భరోసా..
- 37 మందికి రూ.21.96 లక్షల సీఎంఆర్‌ఎఫ్ సాయం.
- 37 మంది లబ్ధిదారులకు రూ.21.96 లక్షల చెక్కులు అందజేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం, సెప్టెంబరు 25:--** అనారోగ్యం ఒక కుటుంబాన్ని ఆర్థికంగా కుదేలు చేయకుండా, వైద్య చికిత్స కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు వైద్యం ఒక సవాలుగా మారిన సమయంలో ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం వారికి ఎంతో ఊరటనిస్తుందని ఆయన తెలిపారు. ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొని నియోజకవర్గానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 21,96,570 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్వయంగా అందజేశారు. చెక్కులను అందజేసే సందర్భంగా లబ్ధిదారులతో మంత్రి ఆత్మీయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సహాయం అందుతున్న తీరుపై వారితో మాట్లాడి, వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... ఒక కుటుంబంలో అనారోగ్యం వచ్చినప్పుడు వైద్య సమస్యతో పాటు ఆర్థిక సమస్య కూడా ఎదురవుతుందని, అలాంటి సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం అత్యంత అవసరమని అన్నారు. వైద్యం చేయించుకోవడానికి డబ్బు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందే ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల కష్టాలను కేవలం తెలుసుకోవడమే కాకుండా, వారికి సాధ్యమైనంత మేరకు పరిష్కారం చూపించడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న కుటుంబానికి ప్రభుత్వం అందించే ప్రతి రూపాయి ఒక ఆర్థిక సహాయం మాత్రమే కాదని, ఆ కుటుంబానికి ధైర్యం ఇచ్చే భరోసా అని మంత్రి అన్నారు. చికిత్స సమయంలో కుటుంబ సభ్యులు మానసికంగా, ఆర్థికంగా కుంగిపోకుండా ప్రభుత్వం అండగా ఉందనే నమ్మకం కల్పించడమే జవీ=ఖీ ఉద్దేశమని తెలిపారు. అర్హత కలిగిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రయోజనం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు, అవసరమైన సమయంలో ప్రజలకు ఆర్థికంగా కూడా చేయూత అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. ప్రజల ఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేస్తున్నామని, ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు అవసర మైన ప్రతి సందర్భంలో అండగా నిలుస్తామని సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

## కొణతాల సారధ్యంలో తోటాడ బైపాస్ జంక్షన్ మహర్దశ.

తోటాడ జంక్షన్ నూకాంబిక ఆర్చ్ వద్ద రూ.50 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణం.



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:** బైపాస్ లోని నూకాంబిక ఆర్చ్, తోటాడ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నూతన ఫ్లై ఓవర్ నిర్మాణానికి కసరత్తు ప్రారంభ మైంది. మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సారథ్యంలో సుమారు రూ. 50 కోట్ల అంచనా వ్యయంతో ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంబంధించి ఎన్హెచ్ఎఐ అధికారుల తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ నిర్మాణానికి అవసర మైన భూ సేకరణ, స్థల పరిస్థితులు, రహదారి విస్తరణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తగు సూచనలు చేశారు. అలాగే అనకాపల్లి తహసీల్దార్ (ఎంఆర్ఓ) వీలైనంత త్వరగా భూ సర్వే పూర్తి చేసి, అవసర మైన భూమిని ఎన్‌హెచ్ఏఐకి వీలైనంత త్వరగా అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీలైనంత తొందరగా ఫ్లై ఓవర్ నిర్మాణం మొదలుపెట్టి ఒక సంవత్సరంలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేశారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే నూకాంబిక ఆర్చ్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు, అనకాపల్లి బైపాస్ పై ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కలగనుంది. ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఎఐ పిడి గిరీష్, ఇతర అధికారులు, జోనల్ కమిషనర్, ఎమ్మార్వో,
డి ఈ, పోలీస్ యంత్రాంగం, సర్వేయర్లు, ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ అభ్యర్థిగా అభ్యర్థిత్వాన్ని పరిశీలించండి సూరే సతీష్ కుమార్.



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:**రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు
తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించండి అని పీలా గోవింద సత్యనారాయణ ని కోరిన దేశం నాయకుడు సూరే సతీష్ కుమార్.
తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జి పీలా గోవింద సత్యనారాయణ కి తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సూరే సతీష్ కుమార్ రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో అనకాపల్లి జోన్ 110, 111 వార్డులకు వైశ్య సామాజిక వర్గానికి చెందిన నాకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా టికెట్ కేటాయించవలసిందిగా కోరుచూ దరఖాస్తు సమర్థించారు.
గతంలో మున్సిపల్ ఎన్నికల్లో, జీవీఎంసీ ఎన్నికల్లో, మా సామాజిక వర్గాన్ని గుర్తించారని విన్నవించారు. కావున నా అభ్యర్థిత్వాన్ని పరిగణ లోకి తీసుకొని నేను తెలుగుదేశం పార్టీకి క్రియాశీలకంగా పని చేసిన విధానాన్ని తమరు గుర్తించి కార్పొరేటర్ అభ్యర్థిగా మీ ద్వారా ఎంపిక చేయవలసిందిగా కోరుచూ వైశ్య ప్రతినిధులతో కలిసి దరఖాస్తును సమర్పించారు

## పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి జి.ఎస్.ఎస్.నాగేశ్వరరావు



**నక్కపల్లి, పెన్ సత్తా సెప్టెంబరు25:** ఈ ఏడాది మార్చిలో జరగబోయే పదవతరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచిపేరు తీసుకునిరావాలని జిల్లా విద్యాశాఖ అధికారి జిఎస్ఎస్ నాగేశ్వరరావు అన్నారు. శు క్రవారం స్థానిక కస్తూరిభా గాంధీ విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు.పాఠశాలలోకి ప్రవేశించగానే విద్యార్థుల క్రమశిక్షణ చూసి వారిని అభినందించారు.పదవతరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి విద్యార్థుల నోట్స్ లు పరిశీలించారు.గణితం లో పలు ప్రశ్నలు వేసి విద్యార్థులు చెప్పిన సమాధానాలతో సంతృప్తి వ్యక్తం చేశారు. మిషన్ మార్చ్ 2026-27 అమలవుతున్న తీరు పరిశీలించారు. ప్రభుత్వం కే.జీ.బీ.వీ లలో చదువుకుంటున్న విద్యార్థినుల భవిష్యత్తుపై ప్రధానంగా దృష్టిసారించిందని,వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని బాగా చదువుకుని పాఠశాలకు మంచిపేరు తీసుకుని రావాలన్నారు. ఆంగ్లం లో విద్యార్థుల పఠనం పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు.అక్టోబరు నెలాఖరునాటికి పదవతరగతి సిలబస్ పూర్తిచేసి రివిజన్ ప్రారంభించాలని, అనంతరం వందరోజుల ప్రణాళికలు కూడా ప్రారంభమవుతాయని అన్నారు.ఈయన వెంట జిల్లా ఉపవిద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు, స్థానిక మండలవిద్యాశాఖాధికారి కే.నరేష్ ,కార్యాలయ సిబ్బంది వెంకటేశ్వరరావు స్పెషలాఫీసర్ సలీమా, లు ఉన్నారులి

## ప్రజలకు మరింత చేరువగా పరిపాలన.

నూతన జిల్లా పరిషత్ కార్యాలయం ప్రారంభించిన మంత్రి సవిత.



**శ్రీసత్యసాయి, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:** ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. కొత్త చెరువులో నూతనంగా నిర్మించిన శ్రీసత్యసాయి జిల్లా పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం మంత్రి సవిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. నూతన జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా పరిషత్ కార్యాలయం అందుబాటు లోకి రావడం ద్వారా పరిపాలనా కార్యకలాపాలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. గతంలో ఉమ్మడి జిల్లా లోనే జిల్లా పరిషత్ కార్యాలయాలు ఉండేవని, ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లాకు ప్రత్యేకంగా నూతన కార్యాలయం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. త్వరలోనే జిల్లాకు సంబంధించిన ఇతర కార్యాలయాల నిర్మాణాన్ని కూడా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీసత్యసాయి జిల్లా అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నూతన జిల్లా పరిషత్ కార్యాలయంలో సుమారు 47 మంది అధికారులు విధులు నిర్వహించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. దీంతో జిల్లా పరిషత్ పరిపాలన ప్రజలకు మరింత చేరువగా, సమర్థవంతంగా కొనసాగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి సులభంగా తీసుకెళ్లేందుకు, ప్రభుత్వ సేవలను వేగంగా పొందేందుకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి జిల్లా పరిషత్ ద్వారా మరింత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. వీఎస్‌జీఆర్ఎం ద్వారా అందుతున్న నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, గతంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కూడా పలు అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు సంబంధించిన నిధులు పక్కదారి పట్టాయని ఆరోపించిన మంత్రి సవిత, ప్రస్తుతం ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని అన్నారు. ప్రజలకు అవసర మైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. తాగునీటి సమస్యను ఎప్పటి కప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాకు ప్రత్యేక మైన పారిశ్రామిక, మౌలిక వసతుల అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. జిల్లాలో కియా వంటి అంతర్జాతీయ స్థాయి దిగ్గజ కంపెనీలు ఉన్నాయని, గొల్లపల్లి రిజర్వాయర్ వంటి కీలక మౌలిక వసతులు కూడా జిల్లాలో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న పారిశ్రామిక, మౌలిక వనరులను సమర్థంగా వినియోగించుకుని మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చేలా అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. అధికారులు ప్రజలతో మమేకమై పనిచేయాలని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. సత్యసాయి జిల్లా అభివృద్ధిలో అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం.





**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:**దీన్ దయాలు ఉపాధ్యాయ జయంతి సందర్భంగా శుక్రవారం భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు పలకారవి ఆధ్వర్యంలో స్థానిక శ్రీరాంనగర్ కాలనీలో గల లెప్రసీ కాలనీలో దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రోగులకు, పేదలకు పండ్లు, దుప్పట్లు, రగులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథుగా అనకాపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర పాల్గొని పళు ్ళ, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర మాట్లాడుతూభారతీయ జనసంఘ్ ప్రముఖ నాయకుడు, గొప్ప తత్వవేత్త, దేశభక్తుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నామన్నారు.దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సమాజం లోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలని ఆకాంక్షించారు. ఆయన ప్రతిపాదించిన "ఏకాత్మ మానవతావాదం" భారతీయ ఆలోచనా విధానానికి ప్రత్యేకమైన దిశను చూపించింది. దేశం అంటే కేవలం భౌగోళిక ప్రాంతం కాదని, ప్రజల సంక్షేమం, సామాజిక సమరసత, సంస్కృతి, దేశభక్తి కలిసిన సమగ్ర భావన అని ఆయన తన ఆలోచనల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బోడ్డేడ నాగేశ్వర రావు, నర్సింగ్ యాదవ్, అలమండ శ్రీనివాసరావు, భానుమతి, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

**ఎన్డీఏ కూటమి ఉమ్మడి కుటుంబం.. ప్రజలకు నిరంతరం అండగా ఉండాలి.**
**నక్కపల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో హోంమంత్రి అనిత సమావేశం.**





**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా, నక్కపల్లి లోని తన నివాసం వద్ద శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి శ్రేణులకు పలు అంశాల పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి లోని మూడు పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎన్డీఏ కూటమి ఒక ఉమ్మడి కుటుంబమని, మూడు పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. గత పాలనను సాగనంపి సుపరిపాలనను తీసుకువచ్చామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు వందకు వంద శాతం విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మూడు పార్టీల నుంచి ఎవరికి అవకాశం లభించినా వారి విజయానికి మిగిలిన కూటమి శ్రేణులంతా సమిష్టిగా పనిచేయాలని సూచించారు. యువత, మహిళలకు కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అనేక రకాల అక్రమ కేసులు పెట్టి కూటమి నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేసారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఇంతటి అభివృద్ధి ఎప్పుడూ జరగలేదని ఆమె పేర్కొన్నారు. గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు రావడం ఎంతో సంతోషకర మైన విషయమన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎన్డీఏ కో ఆర్డినేషన్ కమిటీని, గ్రామ స్థాయిలో త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఎక్కడా అవకతవకలకు, అక్రమాలకు తావులేకుండా నిజాయితీగా పనిచేయాలని స్పష్టం చేశారు.

శాప్ కార్యాలయం పై వైసీపీ దాడి చేయడం దుర్మార్గమని అనిత వ్యాఖ్యానించారు. అనంతరం ఈ అంశం పై జగన్ రెడ్డి గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనకాపల్లి ప్రగతి యాత్రలో మరో మైలురాయి -- జిల్లా పరిషత్.

**అనకాపల్లిలో నూతనంగా ప్రారంభ మైన జిల్లా పరిషత్.**
**ప్రజలకు మరింత చేరవకానున్న పాలన.**
**జిల్లా పరిషత్ అదనపు బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.**











**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:** ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లాలో శు క్రవారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణ మూర్తి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి, ప్రజలకు శుభ దినమని, గతంలో ఉమ్మడి పరిధిలో సమావేశాలు జరగడం వల్ల జిల్లా సమస్యల పై చర్చించడానికి సమయం తక్కువగా ఉండేదని, ఇప్పుడు ప్రత్యేక జిల్లా పరిషత్ ఏర్పడటంతో అనకాపల్లి సమస్యలన్నింటినీ వివరంగా చర్చించి తగిన నిర్ణయాలు తీసుకునే అవకాశం లభించిందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. జిల్లాకు వచ్చే నిధులను పూర్తిగా అనకాపల్లి జిల్లా అభివృద్ధి పనులకే ఖర్చు చేయడానికి వీలు కలుగుతుందని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కు సంబంధించిన ప్రతి ఒక్క అధికారి జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించడానికి పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఈ సందర్భముగా శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గతంలో స్థానిక ప్రజా ప్రతినిధులకు సౌకర్యం లేక విశాఖపట్నం వెళ్లాల్సి రావడం వల్ల పాయకరావుపేట, మాడుగుల, నర్సీపట్నం తదితర ప్రాంతాల ప్రజా ప్రతినిధులు (సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు) ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు అనకాపల్లి లోనే జిల్లా పరిషత్ అందుబాటు లోకి రావడం వారికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. గతంలో గెస్ట్ హౌస్‌గా నిర్మించిన భవనం, కాలక్రమేణా ఆర్డీవో కార్యాలయంగా మారి, ప్రస్తుతం అప్‌గ్రేడ్ అయ్యి జిల్లా పరిషత్ కార్యాలయంగా రూపాంతరం చెందిందని చెప్పారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న ఆస్తుల్లో 24 జెడ్పీటీసీలు ఉన్న అనకాపల్లి జిల్లాకు తగిన వాటా కేటాయించాలని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి లను ఉన్నత అధికారులు కోరారని చెప్పారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ పాత భవనాలను తొలగించి, 4 అంతస్తుల నూతన భవనాన్ని నిర్మించి అనుసంధానించాలని అన్నారు. ఇందులో జనరల్ బాడీ సమావేశ మందిరం, గెస్ట్ హౌస్‌లు, ఇతర కార్యాలయాలు ఏర్పాటుకు అవకాశం ఉంటుందని తెలిపారు. శారదా నది ఒడ్డున జెడ్పీకి ఉన్న ఎకరం స్థలంలో పార్క్, గెస్ట్ హౌస్ నిర్మించేందుకు అనుకూల మైన వాతావరణం ఉందని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఇంజిన్‌గా అనకాపల్లి జిల్లా ఉండాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఈ జిల్లా అత్యధిక ఆదాయం, తలసరి ఆదాయం ఇచ్చే ప్రధాన గ్రోత్ ఇంజిన్‌గా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి నిధులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఆధ్వర్యంలో 15 వ, 16 వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు, స్థానిక సంస్థలకు అందిస్తూ గ్రామాల పునరుద్ధరణకు కృషి చేస్తున్నారని తెలిపారు. రహదారుల నిర్మాణం, పల్లె పథకం ద్వారా మొదటి విడతలో సుమారు 4,000 కి.మీ, రెండో విడతలో 6,000 కి.మీ రోడ్ల నిర్మాణం జరిగిందని, త్వరలోనే మూడో విడత కూడా ప్రారంభం కానుందని చెప్పారు. ఈ జిల్లాను అగ్రగామి జిల్లాగా మార్చేందుకు ప్రజలందరూ భాగస్వాములై అనకాపల్లిని రాష్ట్రం లోనే నంబర్ వన్ జిల్లాగా తీర్చిదిద్దడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈవో నారాయణ మూర్తి, అనకాపల్లి డిప్యూటీ సీఈవో ఇ.సందీప్, డిపిఓ మంజులవాణి. అనకాపల్లి ఎంపీడీవో ఆశాలత ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయులు పై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం సిగ్గు చేటు.

మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా.



**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:** మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో నియమితులైన ఉపాధ్యాయుల పై వైసీపీ కార్యకర్తలు దాడులు చేయడం చాలా బాధాకరం విషయం అని మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా విచారం వ్యక్తం చేశారు. విజయవాడ లో క్రీడల శాఖ మంత్రి రామప్రసాద్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయుల పై దాడి చేయడాన్ని వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు) తీవ్రంగా ఖండించారు. ఎన్నో సంవత్సరాలుగా క్రీడల్లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వం నిబంధనలు ప్రకారం ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయలు ను లక్ష్యం గా చేసుకుని గొడ్డలి పార్టీ కార్యకర్తలు దాడులు చేయడం సరికాదు అని, గురువులు ను గౌరవించాలి అనే సమస్కారం లేని మీలాంటి వారిని ప్రజలు గమనిస్తున్నారని, మళ్లీ మీకు ప్రజలే బుద్ధి చెబుతారు అని వియ్యపు చిన్నా తెలియచేసారు. నిబంధనలు ప్రకారం ఉద్యోగాలు సాధించిన వారి పై తప్పుడు ఆరోపణలు చేయడం వారిని అవమానించడమే అవుతుంది అని హెచ్చరించారు. మెగా డీఎస్సీ పై మీకు అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులు ఉన్నారు వారి దృష్టికి మీరు తీసుకు వెళ్ళితే వారు పరిస్కరిస్తారు. మెగా డీఎస్సీ జాబ్స్ ఇచ్చి ఇప్పటికీ సంవత్సర కాలం పూర్తి అయ్యింది. వైసీపీ నాయుకులకు ఉద్యోగాలు ఇవ్వడం ఎలాగు చేత కాలేదు ఇచ్చిన వారి పై నిందలు వేయడం వారికి వెన్నతో పెట్టిన విద్యే అని వియ్యపు చిన్నా తెలియ చేశారు. మంచి చేస్తున్న ప్రభుత్వం పై విమర్శలు బురద జల్లడం గొడ్డలి పార్టీ మానుకోవాలి అని, మీ దగ్గర ఏమైనా ఆధారాలు ఉంటే నిరూపించండి, అంతే కానీ ఆధారాలు లేకుండా అవమానం చేస్తే ఊరుకునేది లేదు అని హేచ్చరించడం జరిగింది. ప్రభుత్వ ఉపాధ్యాయలు పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలి అని పత్రికా ముఖముగా వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం అధ్యక్షులు) తెలియ చేసారు.

# షిప్ ల్యాండింగ్ పనులు ప్రారంభించాలని హోం మంత్రికి మత్స్యకారులు వినతి



నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 25:
మత్స్యకార గ్రామం రాజయ్యపేటలో ప్రభుత్వం తలపెట్టిన షిప్ ల్యాండింగ్ నిర్మాణం పనులను ప్రారంభించాలని హోంమంత్రి వంగలపూడి అనితకు శుక్రవారం మత్స్యకారులు వినతిపత్రం చేశారు. రాజయ్యపేట పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. సందర్భంగా వారంతా మాట్లాడుతూ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి సంబంధించి జూన్ 28న శంకుస్థాపన జరిగిందని శంకుస్థాపన జరిగి మూడు నెలలు గడిచినా, ఇప్పటివరకు ఎటువంటి పనులు ప్రారంభం కాలేదని అన్నారు. వేలాది మంది మత్స్యకారులమైన మేమంతా సముద్ర వేటపైనే ఆధారపడి జీవిస్తున్నామని చిన్నపాటి వర్షం లేదా తుఫాను వచ్చినా వేటకు వెళ్ళలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఈ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పూర్తయితే మత్స్యకారుల జీవనోపాధికి ఎంతో మేలు జరుగుతుందని వెంటనే పనులు ప్రారంభించి, త్వరగా పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని
హోం మంత్రి అనితను కోరారు . రాజయ్యపేటలోని తుఫాను రక్షిత భవనంలో బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభించడం ఆనందదాయకమని . అయితే, విద్యార్థుల వసతి మరియు చదువుకు ఇబ్బంది కలగకుండా, ఈ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మాణానికి నిధులు కేటాయించి భవన నిర్మాణం చేపట్టాలని కోరారు.
మా ప్రాంతంలో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయవద్దని గతంలో మేము చేపట్టిన ధర్నా సమయంలో మా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చి, మా మత్స్యకార గ్రామానికి న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు.
ఈ విషయాలపై సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలోఎం.మహేష్ బాబు,జి.సోమేశ్వరరావు, సిహెచ్ .సోమేష్,కి.దేముడు, ఎం.బైరాగిరాజు, ఎం.శివాజీ, కె.కాశీరావు, బి బాపూజీ, వి.శ్రీను,బి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాజయ్యపేటలో అభివృద్ధి పనులకు హోం మంత్రి శ్రీకారం





**రూ.4.30 కోట్లతో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన**
**బాలికల గురుకుల పాఠశాల ప్రారంభం**

**నక్కపల్లి,పెన్ సత్తా సెప్టెంబర్ 25 :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామానికి చేరుకున్న మంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజయ్యపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సారిపల్లిపాలెం--రాజయ్యపేట ఆర్అండ్బీ రహదారి నిర్మాణానికి హోం మంత్రి అనిత శంకుస్థాపన చేశారు. ఆర్అండ్బీ నిధులు రూ.3 కోట్లతో ఈ రహదారిని నిర్మించనున్నారు. పాయకరావుపేట--పెంటకోట ఆర్అండ్బీ రహదారి నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు కేటాయించారు.
అనంతరం రాజయ్యపేటలో మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) బాలికల గురుకుల పాఠశాలను మంత్రి అనిత ప్రారంభించారు. పాఠశాలలో రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పాఠశాలలోని వివిధ గదులను పరిశీలించిన మంత్రి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.
రాజయ్యపేటలో ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల ప్రారంభం కావడంతో బీసీ వర్గాల చిరకాల కల సాకారమైందని గ్రామ ప్రజలు పేర్కొంటూ మంత్రి అనితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 50 మంది కార్యకర్తలను మంత్రి అనిత తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రాజయ్యపేట, నక్కపల్లి ఆటో స్టాండ్లలో ఆటో డ్రైవర్లకు 'అభయ' మహిళా భద్రత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు సంబంధించిన అభయ కార్యక్రమం వివరాలను వారికి తెలియజేశారు. ఆటోలు, ఆర్టీసీ బస్సులకు అభయ



స్టిక్కర్లను మంత్రి అనిత స్వయంగా అంటించారు. నక్కపల్లిలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలకు కూడా 'అభయ' మహిళా రక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు ఎన్డీఏ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా హోం మంత్రి అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పరుగుల బరిలో "విజయ" కేతనం

## మహిళా కానిస్టేబుల్ విజయకు హోంమంత్రి అనిత సత్కారం

**నక్కపల్లి, పెన్ సత్తా సెప్టెంబర్ 25:**
విధి నిర్వహణలో పోలీసు.. క్రీడా ప్రాంగణంలో క్రీడాకారిణి.. పరుగుల బరిలో దిగితే "విజయ" కేతనం సాధించడమే లక్ష్యంగా దూసుకెళ్తున్న పాయకరావుపేట పోలీసుస్టేషన్ మహిళా కానిస్టేబుల్ వి. విజయ తన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. పోలీసు విధులను సమర్థంగా నిర్వహిస్తూనే క్రీడల్లోనూ సత్తా చాటుతున్న విజయ..ఇటీవల అమరావతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం ఆరు విభాగాల్లో పాల్గొని బంగారు పతకాలను సాధించారు. 5 వేల మీటర్లు, 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగుతో పాటు 400ఐ4 మీటర్ల రిలేలోనూ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా ఖోఖో, కబడ్డీ పోటీల్లోనూ విజయ ప్రాతినిధ్యం వహించిన జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. దీంతో ఆయా విభాగాల్లోనూ ఆమె బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ విజయ సాధించిన ఈ విజయాలు పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచాయి. ఈ సందర్భంగా నక్కపల్లి మండలంలోని తన నివాసం వద్ద శుక్రవారం కానిస్టేబుల్ తో హోం మంత్రి అనిత టిఫిన్ చేస్తూ, వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం హోంమంత్రి వంగలపూడి అనిత మహిళా కానిస్టేబుల్ విజయను ఘనంగా సత్కరించి అభినందించారు. క్రీడల్లో విజయ సాధించిన పతకాల వివరాలను తెలుసుకుని ప్రత్యేకంగా ప్రశంసించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ పలువురికి విజయ స్ఫూర్తిగా నిలుస్తున్నారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే పాయకరావుపేట పోలీస్ పరిధిలో పలు కేసులు దర్యాప్తులో కీలకపాత్ర వహించడమే కాకుండా, సాంకేతికంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న కానిస్టేబుల్ రాంబాబును కూడా హోం మంత్రి అనిత సత్కరించారు. అవయవ దానం చేసిన నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసురావును హోం మంత్రి అనిత అభినందించారు.











## ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రూట్ మ్యాప్

**విజయవాడ, సెప్టెంబర్ 25, :** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ప్రవాహం, పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ స్థాయిలో సరికొత్త ఎజెండాను బలంగా వినిపిస్తున్నారు. ఢిల్లీ వేదికగా పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలతో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫైర్‌సైడ్ చాట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దశాబ్దాలుగా అమలు చేస్తున్న సమర్థవంతమైన పాలనా నమూనాను గుర్తుచేస్తూ.. పని, జవాబుదారీతనం, నాణ్యమైన సేవలు అనే మూడు మూలస్తంభాలపైనే తమ ప్రభుత్వం నడుస్తోందని స్పష్టం చేశారు. ఒకప్పుడు ప్రపంచమంతా మాట్లాడిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశ దాటిపోయిందని, ఆధునిక పోటీ ప్రపంచంలో వేగమే సర్వస్వమని, అందుకే కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను తమ అధికారిక పాలనా సంస్కృతిగా మార్చుకుందని లోకేష్ ప్రకటించారు.పరిపాలనలో జవాబుదారీతనం కేబినెట్ మంత్రుల స్థాయి నుంచే మొదలవుతోందని లోకేష్ స్పష్టం చేశారు. మంత్రుల పనితీరు నివేదికలు , ఫైళ్ల పరిష్కార వేగం , మంత్రుల ర్యాంకింగ్‌లు, క్షేత్రస్థాయిలో కలెక్టర్లతో లైవ్ రివ్యూ సమావేశాలు నిర్వహించడానికి అపారమైన రాజకీయ ధైర్యం అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కఠినమైన పనితీరును ఐదేళ్లపాటు నిరంతరాయంగా కొనసాగిస్తే, ఆ జవాబుదారీతనం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రతి గ్రామంలోని కింది స్థాయి ఉద్యోగి వరకు చేరుతుందని అన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా విలాసవంతమైన ప్యాలెస్‌లు కట్టుకోవడం సులభమేమో కానీ.. నిజమైన సుపరిపాలన అందించడం అంటే ఒక మహత్తర బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఇదే సిద్ధాంతం గత 44 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ పసుపు జెండాను తరతరాలుగా సగర్వంగా నిలబెట్టిందని ఆయన వివరించారు.రాష్ట్రానికి ప్రాజెక్టులను తీసుకురావడంలో తమ ప్రభుత్వం అవలంబిస్తున్న దూకుడు వ్యూహాన్ని లోకేష్ పంచుకున్నారు. ఒకప్పుడు గుజరాత్ రాష్ట్రం ఇతర ప్రాంతాల నుంచి భారీ పరిశ్రమలను తరలించుకుపోతోందని వార్తలు వినే స్థాయి నుంచి, నేడు స్వయంగా గుజరాత్‌కే వెళ్లి అక్కడ వ్యాపార దిగ్గజాల ముందు ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా నిలబెట్టేందుకు తాను త్వరలోనే పర్యటించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొన్నప్పుడే దేశం అంతిమంగా విజయం సాధిస్తుంది అని స్పష్టం చేశారు. వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి నుంచి సాధారణ పాలన వరకు ప్రతి అంశంలోనూ పనులను శరవేగంగా అమలు చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని తెలిపారు.రాష్ట్రంలో పారిశ్రామిక వేగాన్ని మరింత విస్తరించేందుకు 23 ఇండస్ట్రీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసిందని లోకేష్ వివరించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన తయారీ సంస్థలు, స్థానిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు , నాణ్యతా పరీక్షా ల్యాబ్‌లు, విద్యా సంస్థలను కేవలం 100 కిలోమీటర్ల పరిధిలోని ఒకే ఎకోసిస్టమ్‌లో అనుసంధానం చేయడమే ఈ క్లస్టర్ల ప్రధాన ఉద్దేశమని చెప్పారు. దీని ద్వారా కంపెనీలకు లాజిస్టిక్స్, ఉత్పత్తి వ్యయాలు భారీగా తగ్గడంతో పాటు అంతర్జాతీయ ఇన్వెస్టర్లను పెద్దఎత్తున ఆకర్షించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తోందని, ఆంధ్రప్రదేశ్ ఇకపై దేశంలోనే ఇన్వెస్ట్‌మెంట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని ఫైర్‌సైడ్ చాట్ వేదికగా మంత్రి నారా లోకేష్ ధీమా వ్యక్తం చేశారు.

## విశాఖకు డబుల్ డెక్కర్ ట్రైన్

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 25, :** సాగర నగరం విశాఖపట్నం ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త విప్లవానికి తెరలేచింది. విశాఖ ప్రజలు ఎప్పటినుంచో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక విశాఖపట్నం డబుల్ డెక్కర్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ కు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలక పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్వయంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించడంతో ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు మార్గం సుగమమైందని, త్వరలోనే క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.తీర నగరమైన విశాఖ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యాధునిక ఇంజనీరింగ్ ప్రమాణాలతో డిజైన్ చేశారు. ఒకే పిల్లర్‌పై దిగువన ఫ్లైఓవర్ రోడ్డు మార్గం, ఎగువన మెట్రో రైలు కారిడార్ వెళ్లేలా డబుల్ డెక్కర్ విధానాన్ని అమలు చేయనున్నారు. భూసేకరణ సమస్యలు, భారీ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు, ఇరుకైన కారిడార్లలో సాధారణ రోడ్డు రవాణా, ప్రజా రవాణా రెండింటికీ ఇది శాశ్వత పరిష్కారంగా నిలవనుంది.ఈ మెట్రో కారిడార్ ద్వారా నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, ఐటీ కారిడార్లు, విద్యా సంస్థలు, పోర్టు ప్రాంతం, ప్రతిపాదిత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనుసంధానానికి విస్తృతమైన లబ్ధి చేకూరనుంది. రోడ్డు ట్రాఫిక్ తీవ్రతను గణనీయంగా తగ్గించడంతో పాటు, సామాన్యులు, ఉద్యోగులు తక్కువ సమయంలో సురక్షితంగా, కాలుష్య రహితంగా ప్రయాణించేందుకు ఈ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది.విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా, ఏపీ ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పానికి కేంద్రం ఆమోదం మరింత వేగాన్ని చేకూర్చింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో శరవేగంగా నిధుల సమీకరణ పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ మెట్రో ప్రాజెక్ట్ పూర్తితో వైజాగ్ రూపురేఖలు అంతర్జాతీయ స్థాయి మెట్రోపాలిటన్ నగరాల సరసన నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

## నలుగురు జెన్‌జీలకు కోటంరెడ్డి టిక్కెట్లు

**నెల్లూరు, సెప్టెంబర్ 25, :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త నాయకత్వానికి బాటలు వేసే దిశగా అధికార కూటమి వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. రాజకీయాల్లో పేరుకుపోయిన సంప్రదాయ మూస ధోరణిని బద్దలు కొడుతూ, డిజిటల్ యుగంలో పెరిగిన జెన్ జీ యువతను ప్రత్యక్ష ప్రజా జీవితంలోకి ఆహ్వానించాలన్న సరికొత్త కాన్సెప్ట్‌ను తెరపైకి తెస్తోంది. తలలు పండిన తర్వాతే ప్రత్యక్ష ఎన్నికల్లోకి రావాలన్న పాతకాలపు నిబంధనలను పక్కనపెట్టి, సమాజం పట్ల బాధ్యత, సామాజిక చైతన్యం, యువ రక్తంలో ఉన్న ఫైర్‌ను గుర్తించి వారిని కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా నిలబెట్టేందుకు క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసింది.ఈ విప్లవాత్మక మార్పునకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయం ఒక బలమైన నాందిగా నిలిచింది. తన నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థ డివిజన్లలో నలుగురు యువ జెన్ జీ అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయించడమే కాకుండా, వారి ఎన్నికల ఖర్చు మొత్తాన్ని తానే స్వయంగా భరిస్తానని ఆయన ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. రాజకీయాలంటే కేవలం ధనబలం, కుల సమీకరణాలు, పాతతరం నేతలకే పరిమితం కాదనే స్పష్టమైన సందేశాన్ని ఇది ప్రజల్లోకి పంపింది. ఇదే మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కీలక నగరాలు, మేజర్ మున్సిపాలిటీల్లో అమలు చేసి, విద్యావంతులైన యువతను రాజకీయాల్లోకి లాగాలని కూటమి పెద్దలు భావిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ఓటరు నాడిని పరిశీలిస్తే.. సాంకేతికత, ఆధునిక ఆలోచనలు, వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే నాయకత్వాన్నే నేటి తరం కోరుకుంటోంది. సోషల్ మీడియా ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే యువతీయువకులు పాలనా వ్యవస్థలో భాగస్వాములయితే స్థానిక సంస్థల పనితీరు సమూలంగా మారుతుందని కూటమి విశ్లేషిస్తోంది.ఈ సరికొత్త ప్రయోగం వెనుక ఉన్న అసలు రాజకీయ లక్ష్యం భవిష్యత్ నాయకత్వ నిర్మాణం . టీడీపీ, జనసేన శ్రేణుల్లో రాబోయే రెండు మూడు దశాబ్దాల రాజకీయాలను శాసించగల బలమైన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ఈ మున్సిపల్ పోరు నుంచే తయారు చేయాలని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో వార్డు, డివిజన్ స్థాయి నుంచే ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులను తీర్చిదిద్దడం వల్ల పార్టీల సంస్థాగత పునాదులు మరింత పటిష్టమవుతాయని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీల బలపరీక్షగానే కాకుండా.. సంప్రదాయ పాతతరం రాజకీయాలకు, ఆవేశం-ఆలోచన కలగలిసిన కొత్తతరం ఆలోచనలకు మధ్య జరిగే పరివర్తనగా మారనున్నాయి. యువతకు టిక్కెట్లు ఇవ్వడంతో పాటు వారిని గెలిపించుకోగలిగితే, ఏపీ రాజకీయాల్లో ఇదొక సువర్ణ అధ్యాయంగా మిగిలిపోనుంది. ఒకప్పుడు రాజకీయాలంటే భయపడి దూరంగా ఉన్న విద్యావంతులైన యువత, నేడు స్థానిక పాలనను తమ చేతుల్లోకి తీసుకునేందుకు సిద్ధమవుతుండటం రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు శుభపరిణామం అవుతుందనడంలో సందేహం లేదు.

## సంపాదకీయం

# అప్పటివరకూ.. ఇంతే!


భారత రాజకీయ వ్యవస్థలో విడ్డూరమైన వైరుధ్యం -ఎన్నికల ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు, పదో షెడ్యూల్ వినా, రాజ్యాంగంలో ఎక్కడా ప్రత్యేక ప్రస్తావన లేకపోవడం. అధికరణ 19 కింద ప్రాథమిక హక్కులను ముందుకు తీసుకెళ్లే "సంఘాలు"గానే వాటిని పరిగణిస్తారు. కంపెనీ, ట్రస్ట్, సొసైటీ, సంస్థగా వాటి చట్టపరమైన స్వభావాన్ని నిర్వచించే ప్రయత్నం ఎప్పుడూ జరగలేదు. అయినా, ఆదాయ పన్ను మినహాయింపు అపూర్వ రీతిలో పొందుతూ, లెక్కలు చూపించని డబ్బుకు అవి రహస్య నిధిగా మారుతున్నాయి. షెల్ కంపెనీలు నిర్దేశించని ప్రయోజనాలు నెరవేర్చినట్టే, షెల్ రాజకీయ పార్టీలూ చీకటి ప్రయోజనాలకు ఉపయోగపడుతున్న రహస్యాన్ని ఇటీవల హిందీ బీబీసీ ఓ కథనాన్ని ఛేదించింది. గుజరాత్ కేంద్రంగా ఉన్న ఆరు నమోదిత గుర్తింపులేని రాజకీయ పార్టీలు (ఆర్‌యూపీపీలు) 2023-24లో సుమారు రూ.1,700.78 కోట్ల విరాళాలు అందుకున్నాయన్నది ఆ దర్యాప్తు కథన సారాంశం. ఈ మొత్తం బీజేపీ వినా ఐదు జాతీయ పార్టీలు (కాంగ్రెస్, ఆప్, బీఎస్పీ, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీ) కలిపి అందుకున్న రూ.1,480.43 కోట్ల కంటే ఎక్కువ! వీటిలో అత్యధికంగా 'ఆమ్ జన్‌మత్ పార్టీ' రూ.620 కోట్లు అందుకోగా, 'సత్యవాది రక్షక్ పార్టీ' రూ.330.55 కోట్లు అందుకుంది. ఈ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో కేవలం ఒక్క అభ్యర్థినే బరిలో నిలిపింది. ఇది భారత రాజకీయాల్లోనే ఆసక్తికరమైన కోణం.

ఇంతకుముందు, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) 2025 జులై 18న విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2022-23లో ఆర్‌యూపీపీల ప్రకటిత ఆదాయంలో 223 శాతం పెరుగుదల నమోదైంది. మొత్తం 2,764 ఆర్‌యూపీపీల్లో కేవలం 739 మాత్రమే ఆర్థిక రికార్డులను భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) సమర్పించాయి. 2025 ఆగస్టులో "ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయడం" పేరిట విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో.. సమగ్ర, నిరంతర వ్యూహంలో భాగంగా 334 ఆర్‌యూపీపీలను తొలగించినట్టు ఈసీఐ ప్రకటించింది. దీంతో ఇప్పుడు దేశంలో ఆరు జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు, 2,520 ఆర్‌యూపీపీలు నమోదై ఉన్నాయి. అయితే, తొలగింపు అంటే నమోదు రద్దు కాదు, ఈసీఐకి సాధారణంగా పార్టీలను రద్దు చేసే అధికారం లేదు. అలాగే, గుర్తింపు లేకున్నా, ఆర్‌యూపీపీలకు ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29ఏ కింద విరాళాలు స్వీకరించే అర్హత ఉంది. ఆదాయ పన్ను చట్టం-2025లోని సెక్షన్ 12 కింద మినహాయింపూ పొందే అవకాశముంది. తొలగింపు వెనుక ఉద్దేశం వాటిని అనర్హులుగా చేయడమే అయినప్పటికీ, అలాంటి విరాళాలు పన్ను మినహాయింపునకు అవి అర్హత పొందుతూనే ఉంటాయా? అన్నది దర్యాప్తు చేయాల్సిన అంశం.

రాజకీయ సంపద స్థాయి ఎంత భారీగా ఉందో ఒక అధ్యయనం వెల్లడించింది. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి 22 రాజకీయ పార్టీలవద్ద వేల కోట్లులున్నాయని, ఎన్నికల ప్రకటన నుంచి పూర్తయ్యే వరకూ మరిన్ని వందల కోట్లు విరాళాలు వచ్చాయని, ప్రచార వ్యయం పోను ఎన్నికల అనంతరం కూడా భారీ మొత్తంలో నగదు, బ్యాంకు నిల్వలు మిగిలి ఉన్నాయని ఈసీఐకి సమర్పించిన లెక్కల ఆధారంగా అధ్యయనం పేర్కొంది. గత దశాబ్దంలో రాజకీయ విరాళాలపై పన్ను మినహాయింపు వల్ల ప్రభుత్వ ఖజానాకు వేల కోట్లు నష్టం వాటిల్లిందని, పార్టీలకు విరాళాలు ఇవ్వడంలో వ్యక్తిగత దాతలు, హిందూ అవిభక్త కుటుంబాలు కార్పొరేట్ సంస్థలను మించిపోయాయనీ అధ్యయనం గుర్తించింది. మొత్తం ప్రకటిత విరాళాల్లో సగంకంటే తక్కువ మొత్తాన్నే పన్ను మినహాయింపుగా క్లెయిమ్ చేయడం, పన్ను ప్రయోజనం లేకుండానే విరాళాలివ్వడానికి పురిగొల్పుతున్న ప్రేరణ ఏమిటన్న ప్రశ్నను లేవనెత్తుతోంది. ఈ మొత్తం వ్యవహారానికి గాఢమైన గోప్యత జోడించింది, పాలక పార్టీ 2018లో ప్రవేశపెట్టిన 'ఎన్నికల బాండ్ల' పథకం. ఈ పథకాన్ని 2024లో సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించినప్పటికీ, తర్వాత బహిర్గతమైన విరాళాల వివరాలు సమాధానం లేని ప్రశ్నలుగా ఉండిపోయాయి. ఎక్కువ ఆర్‌యూపీపీలకు ఎన్నికల బాండ్లు అందలేదు, ఎందుకంటే అవి నిర్దిష్ట శాతం ఓట్లు సాధించిన పార్టీలకు మాత్రమే పరిమితం. మరి ఈ విరాళాలు ఇచ్చింది ఎవరు? ఎందుకు? అన్నది ఇప్పటికీ మిస్టరీనే. రాజకీయ పార్టీలు పారదర్శకత పట్ల ఎప్పుడూ పెద్దగా ఆసక్తి చూపలేదు. తమను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావాలన్న కేంద్ర సమాచార కమిషన్ ఆదేశాన్ని వ్యతిరేకించడంలో అన్ని పార్టీలూ ఏకమయ్యాయి. ఆసక్తికరంగా, సీఐసీ మినహా, ఈసీఐగానీ సుప్రీంకోర్టుగానీ దీన్ని అమలు చేయాలన్న ఆసక్తి చూపలేదు. సాధారణ పన్ను చెల్లింపుదారుల మాదిరిగా, రాజకీయ పార్టీల ఖాతాల పరిశీలన ఆదాయ పన్ను శాఖ, ఈడీలకు ప్రాధాన్యతగా అనిపించకపోవచ్చు. యాంత్రికంగా సమర్పించే లెక్కలను ప్రశ్నించే అధికారం, ఉద్దేశం ఈసీఐకి లేదు. చట్టాన్ని పాటించడానికి లెక్కల సమర్పణే సరిపోతుంది, దాని ఆత్మ మాత్రం మిగిలిపోతుంది. ఆ ఆత్మను ఎవరు, ఎలా పునరుద్ధరిస్తారు? ఎన్నికల బాండ్ల వ్యవహారంపై, పెండింగ్‌లో ఉన్న పిటిషన్లలో ఆరోపిస్తున్న క్విడ్ ప్రో కో అంశంపై కోర్టు పర్యవేక్షిత దర్యాప్తునకు ఆదేశించడం సుప్రీంకోర్టు బాధ్యతగా మారింది. ఎన్నికల ప్రక్రియలో గణనీయంగా పాల్గొనకుండానే భారీ విరాళాలు అందుకుంటున్న అప్రధానమైన ఆర్‌యూపీపీల దృగ్విషయాన్ని కూడా ఈ దర్యాప్తు పరిశీలించాలి. "అధికారానికి నిల్వ కేంద్రం"గా అభివర్ణించిన అధికరణ 324 కింద తనకున్న అధికారాలను వినియోగించి, రాజకీయ పార్టీల ఖాతాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ద్వారా ఆడిట్ చేయించాలని ఈసీఐ ఆదేశించాలి. ఎన్నికల సమయంలో పార్టీల వ్యయంపై పరిమితి విధించడాన్నీ పరిగణించాలి. దీన్ని కమిషనే పదేపదే సిఫారసు చేసింది. విరాళాలపై పన్ను మినహాయింపును నిర్దేశిత వ్యయ పరిమితికే పరిమితం చేయాలి, పార్టీలను సంపన్నం చేసే మిగిలిన అన్ని విరాళాలపై పూర్తిగా పన్ను విధించాలి. మార్గదర్శకాలను అనుసరించి ఎన్నికల్లో పోటీ చేయని ఏ ఆర్‌యూపీపీనైనా స్వయంచాలకంగా తొలగించే ప్రక్రియను, ప్రామాణిక ఆకృతుల్లో ఆర్థిక డేటాను అప్‌లోడ్ చేయగల కేంద్రీకృత డిజిటల్ పోర్టల్‌ను ఈసీఐ ఏర్పాటు చేయాలి. నిజమైన ఓటర్లను.. జాబితా నుంచి తొలగించే పనిలో నిమగ్నం కావడం కంటే, ఎన్నికల వాతావరణాన్ని ప్రక్షాళన చేయడంలో తన శక్తిని, అధికారాన్ని ఈసీఐ వెచ్చించనివ్వాలి. అప్పటివరకూ, "మేమిక్కడ ఉన్నాం" అని నినదించడం వినా.. ప్రజలకు మరో మార్గం లేదు!

---

## పనికొచ్చే పలుకు



# ఆటలో.. నిలబడాలి!

జీవితం రేస్ అయితే.. రోజూ ఫినిషింగ్ లైన్ దాటాల్సిన అవసరం లేదు. కొన్ని రోజులు వేగంగా పరిగెత్తగలం. కొన్ని రోజులు నెమ్మదిగా నడవాల్సి వస్తుంది. మరికొన్ని రోజులు అసలు ముందుకు కదలలేనట్టుగా అనిపించొచ్చు. కానీ ఒక విషయం మాత్రం ముఖ్యం -రేస్‌నుంచి బయటకు వెళ్లకపోవడం. మనలో చాలామందికి విజయాన్ని చూసే విధానం భిన్నంగా ఉంటుంది. వెంటనే ఫలితం రావాలి. మొదలుపెట్టిన పని త్వరగా పూర్తవ్వాలి. కొత్త అలవాటు పెట్టుకుంటే కొద్ది రోజుల్లోనే మార్పు కనిపించాలి. జిమ్‌కు వెళ్తే వెంటనే శరీరంలో మార్పు రావాలి. కొత్త స్కిల్ నేర్చుకుంటే వెంటనే నైపుణ్యం రావాలి. అలా జరగకపోతే.. "ఇది నావల్ల కాదు" అంటూ మధ్యలోనే ఆపేస్తాం. కానీ నిజమైన ఎదుగుదల అక్కడే మొదలవుతుంది, ఫలితం కనిపించని సమయంలోనూ ప్రయత్నాన్ని కొనసాగించినప్పుడు.

మొక్కను నాటిన రోజే పండ్లు రావు. ప్రతిరోజూ నీళ్లు పోయాలి. ఎండైనా, వానైనా దాన్ని చూసుకోవాలి. బయటకు పెద్దగా మార్పు కనిపించని రోజుల్లోనూ లోపల వేర్లు బలపడుతూనే ఉంటాయి. మన జీవితంలో చేసే చిన్న ప్రయత్నాలూ అంతే. బయటికి కనిపించకపోయినా.. మనలో మార్పు జరుగుతూనే ఉంటుంది.

ఇదే విషయాన్ని లైఫ్‌స్టైల్‌కు అన్వయిస్తే చాలా విషయాలు అర్థమవుతాయి. ఆరోగ్యంగా ఉండాలని నిర్ణయించుకున్నాం అనుకోండి. మొదటివారం డైట్ పాటించాం. రెండోవారం వ్యాయామం చేశాం. మూడోవారం బిజీగా ఉండి రొటీన్ మిస్ అయింది. అక్కడితో "నావల్ల కాదు" అనుకోవాల్సిన అవసరం లేదు. మరుసటి రోజు మళ్లీ మొదలుపెట్టొచ్చు. ఒక రోజు రొటీన్ తప్పిపోవడం ఓటమి కాదు, దాన్ని శాశ్వతంగా వదిలేయడమే అసలు సమస్య.

జెన్ జీకి ఈ సూత్రం మరింత అవసరం. ఎందుకంటే ఈ తరం ముందు అవకాశాలు ఎంత ఎక్కువగా ఉన్నాయో.. డిస్ట్రక్షన్స్ కూడా అంతే ఎక్కువ. ఒక స్కిల్ నేర్చుకుంటూ ఉండగానే మరో ట్రెండ్ కనిపిస్తుంది. ఒక లక్ష్యంపై ఫోకస్ పెడుతుండగానే సోషల్ మీడియాలో మరో విజయకథ కనిపిస్తుంది. దాంతో మన ప్రయాణం నెమ్మదిగా ఉందేమోననే అనుమానం మొదలవుతుంది. కానీ ఇతరుల హైలైట్స్‌తో మన బిహైండ్ ది సీన్స్‌ను పోల్చుకోవడం సరైన కొలమానం కాదు.

జీవితం మనకు ఎప్పుడూ ఒకే రకమైన పరిస్థితులు ఇవ్వదు. అందుకే నిలకడ అంటే ఒకే పద్ధతిలో మొండిగా కొనసాగడం కాదు. పరిస్థితులకు అనుగుణంగా పద్ధతిని మార్చుకుంటూ లక్ష్యాన్ని మాత్రం వదలకుండా ఉండటం. జిమ్‌కు వెళ్లలేని రోజు ఇంట్లోనే వర్కౌట్ చేయొచ్చు. ఎక్కువ సమయం చదవలేని రోజు కనీసం కొంతసేపు చదవొచ్చు. పెద్ద లక్ష్యాన్ని ఒకేసారి చేరుకోలేకపోతే దాన్ని చిన్న టార్గెట్లుగా విడగొట్టొచ్చు. మనకు ప్రతిరోజూ విజయం అవసరం లేదు. ప్రతిరోజూ ఒక చిన్న అడుగు చాలు. కొన్ని రోజులు మనం ముందుకు వెళ్తాం. కొన్ని రోజులు అక్కడే ఉంటాం. కొన్ని రోజులు ఒక అడుగు వెనక్కి వెళ్లాల్సి కూడా రావచ్చు. కానీ మళ్లీ ముందుకు కదిలే మనస్తత్వమే మనల్ని గమ్యంవైపు తీసుకెళ్తుంది. అందుకే జీవితంలో మీపై ఎన్ని సవాళ్లు వచ్చినా.. మీ సామర్థ్యాన్ని ఒక చెడ్డ రోజు ఆధారంగా నిర్ణయించుకోకండి. ఒక ఫెయిల్యూర్ మీ కథకు ముగింపు కాదు. ఒక ఆలస్యం మీ ప్రయాణానికి బ్రేక్ కాదు. ఆపేయడం మాత్రమే నిజమైన ముగింపు.

గుర్తుంచుకోండి..
రోజూ గెలవాల్సిన అవసరం లేదు.
రోజూ నిలబడాలి.
ఎందుకంటే విజయం ఒక్కరోజు సాధించిన ఫలితం కాదు..
ఎన్ని రోజులు వదలకుండా నిలబడ్డామో దాని ఫలితం!

---

# ట్రంప్ తుమ్మితే.. తిరుప్పూర్‌కు జలుబు!




తమిళనాడులోని నొయ్యల్ నది ఒడ్డునున్న తిరుప్పూర్‌కు 'డాలర్ సిటీ' అనే ముద్దుపేరు ఊరికే రాలేదు. వేలాది ఎగుమతి ఆధారిత దుస్తుల, హోజియరీ యూనిట్లు, వాటిని నడిపించే వలస కార్మికులు, వారు తీసుకొచ్చే డాలర్లు కలిసి ఈ నగరానికి ఆ పేరు తెచ్చిపెట్టాయి. భారత నిట్‌వేర్ ఎగుమతుల్లో దాదాపు 55-60 శాతం వాటా ఒక్క తిరుప్పూర్‌దే. గత ఏడాది అమెరికా.. భారత వస్తువులపై 50 శాతం సుంకం విధిస్తుందన్న భయం, ఈ నగరంలో పెద్ద కలకలం రేపింది. ఆర్డర్లు రద్దయ్యాయి, ఎగుమతిదారులు తమ అతిపెద్ద మార్కెట్‌ను కోల్పోతామేమోనన్న భయంతో వణికిపోయారు. అత్యధిక సుంకాల షాక్ తీవ్రంగా ఉన్న సమయంలో, వలస కాంట్రాక్ట్ కార్మికులే మొదట బాధితులయ్యారు. చాలామందిని ఉద్యోగాలనుంచి తీసేయగా, పరిశ్రమలు నిరుపయోగంగా ఉన్న కార్మికులకు జీతాలు చెల్లించలేక, తమ మూటాముల్లె సర్దుకుని ఉత్తరాదికి రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనేక యూనిట్లు మూతపడ్డాయి, మరికొన్ని కుంచించుకుపోయాయి. 2025 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ సాగిన ఈ సంక్షోభం, 2026 ప్రారంభంలో తాత్కాలికంగా కొంత కోలుకున్నప్పటికీ, ఎగుమతి యూనిట్లు ఇప్పటికీ తమ శ్రామికశక్తిని పునర్వ్యవస్థీకరిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు సరిగ్గా ఏడాది తర్వాత, ఆంక్షలు, సుంకాల నీడ మళ్లీ వెనక్కి వచ్చింది. సెప్టెంబర్ 18న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'లిండ్సే ఓ గ్రాహం రష్యా, ఇరాన్‌లపై ఆంక్షల చట్టం-2026'పై సంతకం చేయడంతో, రష్యా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే దేశాలపై వందశాతం వరకూ సుంకాలు విధించే మార్గం తెరుచుకుంది.

వంద శాతం సుంకం విధిస్తే, అమెరికా మార్కెట్‌పై ఆధారపడిన తిరుప్పూర్ వంటి ఎగుమతి కేంద్రాలపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. గత ఏడాది తిరుప్పూర్ ఎగుమతుల్లో దాదాపు 30-35 శాతం అమెరికాకే వెళ్లాయి కాబట్టి, మళ్లీ అనిశ్చితి మొదలైంది. కాని, ఇప్పుడు తిరుప్పూర్ వాతావరణం శాంతంగానే ఉంది. "గత ఏడాది సుంకాల బెదిరింపులు, భౌగోళిక-రాజకీయ కల్లోలం, ఆర్డర్లు నిలిచిపోవడం, రద్దవడం.. ఇదొక రోలర్ కోస్టర్ రైడ్‌లా సాగింది. కానీ నేను ఆశావాదిగానే ఉన్నాను" అని తిరుప్పూర్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ (టీఈఏ) కార్యనిర్వాహక కార్యదర్శి దినేష్ బాబు రవికృష్ణన్ అన్నారు. ఎందుకంటే, తిరుప్పూర్ ఎగుమతిదారులు ఒక్క మార్కెట్‌పైనే ఆధారపడటం మానుకున్నారు. దానికి ఇప్పుడు బ్రిటన్, యూరప్ కొత్త మార్కెట్లవుతున్నాయి. 2026 జులై 15న అమల్లోకి వచ్చిన భారత్-బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ), భారత ఎగుమతుల్లో 99 శాతానికి సుంకం రహిత ప్రవేశాన్ని కల్పించడంతో, బంగ్లాదేశ్, వియత్నాంవంటి పోటీదారుల కంటే భారత తయారీదారులకు మెరుగైన పోటీతత్వాన్ని అందిస్తోంది. రష్యా చమురు కొనుగోలుదారులను లక్ష్యంగా చేసుకున్న కొత్త అమెరికా చట్టం గురించి ఆందోళన చెందుతున్నప్పటికీ, షాక్‌లను జీర్ణించుకోవడం నేర్చుకున్నారు. ఎగుమతిదారులు మార్కెట్లను, ఉత్పత్తులను వైవిధ్యపరుస్తున్నారు, ఆర్డర్లను ముందుకు తీసుకువస్తున్నారు, అంతరాయం ఇక మినహాయింపు కాదన్న ప్రపంచానికి సిద్ధమవుతున్నారు. కొన్ని ఎగుమతి యూనిట్లు ఉత్పాదకతను పెంచుకునేందుకు, ఖర్చులు తగ్గించుకునేందుకు ఆటోమేషన్‌వైపు మళ్లుతున్నాయి. 2027 వసంతకాల ఆర్డర్లను ముందుగానే త్వరితం చేసి రవాణా చేసేందుకు భారత దుస్తుల ఎగుమతిదారుల మధ్య ఒక 'ఫుల్-ఫార్వర్డ్' పోటీ నడుస్తోందని వార్తా నివేదికలు చెబుతున్నాయి. తాము నియంత్రించలేని 'కల్లోలాన్ని' ఫేస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పత్తిపైనే సాంప్రదాయకంగా ఎక్కువగా ఆధారపడిన తిరుప్పూర్ నిట్‌వేర్ పరిశ్రమ, ఇప్పుడు ఉద్భవిస్తున్న అంతర్జాతీయ ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు పత్తి, కృత్రిమ ఫైబర్ (ఎంఎంఎఫ్) ఉత్పత్తుల మిశ్రమం వైపు వైవిధ్యపరచుకునే ప్రయత్నం చేస్తోందని రవికృష్ణన్ చెప్పారు.

తిరుప్పూర్ దుస్తుల పరిశ్రమలో పనిచేస్తున్న దాదాపు పది లక్షల కార్మికుల్లో.. సగంమంది వలస కార్మికులే. అనుభవజ్ఞులైన స్థానిక తమిళులు, ఉత్తరాది వలస కార్మికులు రొటీన్ పనితో విసిగిపోయి వెళ్లిపోతుంటే.. కొన్ని ఎగుమతి యూనిట్లు కార్మిక కొరత ఎదుర్కొంటున్నాయి. దీనికితోడు కొత్త సుంకాల బెదిరింపు ఉన్నా.. ఉత్తర భారతంనుంచి వలస కార్మికులు ఇప్పటికీ వస్తూనే ఉన్నారు. వీరిలో అధికులు బిహార్ నుంచీ వస్తున్నారు, క్రమంగా తమ కుటుంబాలను, పిల్లలను కూడా తీసుకొస్తున్నారు. ఈ వలస పిల్లలకు అనధికారిక తరగతుల ఏర్పాటుకూ కొన్ని సంస్థలు ప్రయత్నిస్తున్నాం. ఈశాన్య రాష్ట్రాలు, ఒడిశానుంచి యువ ఒంటరి మహిళలు కూడా పనికోసం వస్తూనే ఉన్నారు, ఫ్యాక్టరీ హాస్టళ్లలో నివసిస్తున్నారు.

ఇది అస్థిరమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జీవితం ఎలా ఉంటుందో చూపే ఒక చిన్న, అర్థవంతమైన చిత్రం. రష్యా చమురు గురించి అమెరికా తీసుకునే ఒక నిర్ణయం, భారత ఎగుమతిదారుడి ఆర్డర్ బుక్‌ను మార్చేయగలదు. ఆ ఎగుమతిదారుడు యూరోపియన్ లేదా బ్రిటిష్ కొనుగోలుదారుడి కోసం వెతకడం ద్వారా, లేదా పత్తి నుంచి సింథటిక్స్‌కు మారడం ద్వారా స్పందిస్తాడు. బిహార్ నుంచి ఒక వలస కుటుంబం అయినప్పటికీ తిరుప్పూర్‌కు తరలివస్తుంది. ఈ మొత్తం వ్యవహారం మధ్యలో ఎక్కడో, ఒక ఎన్జీవో కార్యకర్త ఆ వలస పిల్లలు స్కూలుకు ఎలా వెళ్తారో కనిపెట్టాల్సి ఉంటుంది. కర్మాగారాలు వైవిధ్యపరచుకోగలవు. మార్కెట్లు మారవచ్చు. ఆర్డర్లను ముందుకు తీసుకురావచ్చు లేదా నిలిపివేయవచ్చు. కానీ పిల్లలు మాత్రం చదువుకోవాల్సిందే. 'సుంకాలు', 'ఆంక్షలు' అనే భాష కొన్నిసార్లు నేలపై నిజంగా ఏం జరుగుతుందో మరుగుపరచగలదు. ఇవి కేవలం ప్రభుత్వాలు ప్రభుత్వాలపై వాడే సాధనాలు మాత్రమే కాదు. భౌగోళిక-రాజకీయ రిస్క్ ఇప్పుడు నిత్య వాణిజ్య ప్రణాళికలో ఒక భాగంగా మారుతోంది. బ్రిటన్, యూరప్ కొత్త అవకాశాలను అందిస్తున్నప్పటికీ, ఈ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ప్రవేశించడం అంత సులభం కాదు. వైవిధ్యీకరణకు పెట్టుబడి కావాలి, సింథటిక్ ఫైబర్‌లలోకి మారాలంటే కొత్త సామర్థ్యాలు కావాలి, కొత్త మార్కెట్లను కనుగొనడానికి టైం పడుతుంది. అతి చిన్న సంస్థలు, తక్కువ భద్రత కలిగిన కార్మికులకు మరో అంతరాయాన్ని తట్టుకునే వెసులుబాటు తక్కువ. తిరుప్పూర్‌లో కనిపిస్తున్న ప్రశాంతతను నిర్లక్ష్యంగా భావించకూడదు. ఇది పాత అంచనాలపై ఇక ఆధారపడలేమని నేర్చుకున్న ఒక ప్రాంతపు ప్రశాంతత. టీఈఏకు చెందిన రవికృష్ణన్ చెప్పినట్టుగా, "స్థిరమైన మార్కెట్లు అంటూ ఏవీ లేవు." తిరుప్పూర్ బయటి ప్రపంచం ఈ కొత్త సుంకాల బెదిరింపును భారత్-అమెరికా చర్చలు, రష్యా చమురు, భౌగోళిక-రాజకీయ పైచేయి పరంగా చర్చించవచ్చు. కానీ ఈ ఎగుమతి కేంద్రం లోపల మాత్రం, ఇది మరింత ఆచరణాత్మకమైన కథ - వీలైనంత ఎగుమతి చేయండి, వేరే మార్కెట్లను వెతకండి, భిన్నమైనదాన్ని తయారుచేయండి, వీలైనచోట ఆటోమేట్ చేయండి, ముందుకు సాగుతూనే ఉండండి. ■

---




మనం ఎంతగానో ఇష్టపడే వారిని కాపాడుకోవడానికి మనవంతుగా సాధ్యమైన పనులన్నీ చేసినప్పటికీ.. కొన్నిసార్లు వారిని కోల్పోక తప్పదు. సర్దుకుపోవడం, క్షమించడం వంటి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ బంధాలు ముగిసిపోవచ్చు. కానీ ఒక బంధం ముగియడం అంటే మీరు విఫలమైనట్లు కాదు.. ఇద్దరి దారులు, భవిష్యత్తు వేరని అర్థం. ఒక చెట్టుకుండే ఏ రెండు కొమ్మలూ ఒకే దిశగా పెరగవు. అలాగే మనసులు కలిసినా.. ప్రయాణాలు ఎప్పుడూ కలిసి సాగకపోవచ్చు. బంధం ముగిసిందని బాధపడటం సహజమే.. కానీ కొన్నిసార్లు విడిపోవడమే ఇద్దరికీ కొత్త దారిని చూపిస్తుంది.

-మహాదేవ

---

## వింతల్లో వింతలు

# మారువేషం.. 'మహిళ' జీవితం!



దొంగతనాలు చేస్తూ ప్రభుత్వ అధికారిగా నటించిన టర్కీకి చెందిన తుగ్రుల్ బషార్‌కు 2018లో మూడేళ్ల జైలు శిక్ష ఖరారవగానే, అతను అదృశ్యమయ్యాడు. ఎనిమిదేళ్ల పాటు పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్న ఇతను, ఇటీవల ఇస్తాంబుల్‌లో పూర్తిగా భిన్నమైన రూపంలో, సొంత సోదరి గుర్తింపుతో జీవిస్తూ దొరికిపోయాడు! ఇతని రూపమార్పిడి ఎంతంటే.. పాత మగ్‌షాట్‌లతో గుర్తుపట్టడం పోలీసులకు అసాధ్యమైంది. చివరికి వేలిముద్రల పరీక్షతోనే అసలు నిజం బయటపడింది. అరెస్ట్ అయినప్పుడు సోదరి ఐడీ కార్డే అతని దగ్గర ఉంది! అధికారిక రికార్డుల్లో లింగమార్పు నమోదు చేయించుకోనందున, ఇప్పుడు ఇతన్ని పురుషుల జైలుకే తరలించనున్నారు.

# రుతురాజ్, నితీష్ ఇన్.. ఆ స్టార్లకు నో ఛాన్స్!

- విండీస్‌తో తొలి వన్డేకు బద్రీనాథ్ ఎంపిక చేసిన భారత తుది జట్టు
- రోహిత్-గిల్ ఓపెనర్లు.. మూడో స్థానంలో కోహ్లీ
- యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, నమన్ ధీర్‌కు చోటు లేదు
- పేస్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డికి అవకాశం
- సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో తొలి వన్డే

వెస్టిండీస్‌తో తొలి వన్డేలో టీమిండియా తుది జట్టు ఎలా ఉండబోతోంది..? రోహిత్‌తో కలిసి ఓపెనింగ్ చేసేది ఎవరు..? రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశం దక్కుతుందా..? నితీష్ కుమార్ రెడ్డిని తుది జట్టులోకి తీసుకుంటారా..? ఈ ప్రశ్నల మధ్య భారత మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ తన అంచనా జట్టును ప్రకటించాడు. యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, నమన్ ధీర్, ఆకిబ్ నబీలను పక్కనపెట్టి రుతురాజ్, నితీష్‌లకు తన పదకొండు మందిలో చోటిచ్చాడు. భారత్-వెస్టిండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్ సెప్టెంబర్ 27న తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో ప్రారంభం కానుంది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో భారత్ బరిలోకి దిగనుండగా, కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా వన్డే జట్టులో ఉన్నారు.

### రోహిత్-గిల్‌తో మొదలు

బద్రీనాథ్ తన అంచనా జట్టులో రోహిత్ శర్మ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఓపెనర్లుగా ఎంచుకున్నాడు. మూడో స్థానంలో విరాట్ కోహ్లీ, నాలుగో స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేశాడు. వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌కు ఐదో స్థానం ఇచ్చాడు. ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న శ్రేయస్ అయ్యర్ వన్డే జట్టులో లేకపోవడంతో రుతురాజ్ తిరిగి జట్టులోకి వచ్చాడు.

### నితీష్‌కు కీలక బాధ్యత

ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ పాత్ర కోసం నితీష్ కుమార్ రెడ్డిని బద్రీనాథ్ ఎంచుకున్నాడు. వాస్తవానికి నితీష్‌ను తొలుత ఆసియా క్రీడల జట్టులో ఎంపిక చేసినప్పటికీ, ఆ తర్వాత అతడిని ఆ జట్టు నుంచి తప్పించి వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉంచారు.

### జడేజా రీఎంట్రీ.. కుల్దీప్‌కు చోటు

సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను ఏడో స్థానంలో తీసుకున్న బద్రీనాథ్.. ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌ను ఎంచుకున్నాడు. పేస్ విభాగంలో ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్‌లకు అవకాశం ఇచ్చాడు. యువ పేసర్ ఆకిబ్ నబీని మాత్రం తన తుది జట్టులోకి తీసుకోలేదు.

### యశస్వి, జురెల్‌కు నిరాశ

బద్రీనాథ్ ఎంపికలో ప్రధానంగా యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, నమన్ ధీర్, ఆకిబ్ నబీలకు చోటు దక్కలేదు. అయితే ఇది బద్రీనాథ్ అంచనా వేసిన జట్టు మాత్రమే. తొలి వన్డేకు అధికారిక తుది జట్టును టీమ్ మేనేజ్‌మెంట్ మ్యాచ్ రోజు ప్రకటిస్తుంది. భారత అధికారిక వన్డే జట్టులో ఈ నలుగురూ ఉన్నారు.

### బద్రీనాథ్ అంచనా తుది జట్టు

రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్. విండీస్‌తో తొలి వన్డేకు బద్రీనాథ్ అంచనా జట్టు.. నితీష్ కుమార్ రెడ్డికీ చోటు




# జోష్నాకు ఆరో పతకం

భారత స్క్వాష్ స్టార్ జోష్నా చినప్ప అరుదైన ఘనత సాధించారు. వరుసగా ఏడోసారి ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటున్న 40 ఏళ్ల జోష్నా.. ఈసారి మిక్స్‌డ్ డబుల్స్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నారు. వెలవన్ సెంథిల్‌కుమార్‌తో కలిసి సెమీఫైనల్‌కు చేరడం ద్వారా ఆమె కెరీర్‌లో ఆరో ఏషియన్ గేమ్స్ పతకం ఖాయమైంది. దీంతో వరుసగా ఏడు ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా ఇప్పటికే రికార్డు సృష్టించిన జోష్నా.. ఇప్పుడు తన పతకాల సంఖ్యను ఆరుకు పెంచుకోనున్నారు.

### ఫిలిప్పీన్స్ జోడీపై విజయం

మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో జోష్నా-వెలవన్ జోడీ ఫిలిప్పీన్స్‌కు చెందిన డేవిడ్ పెలినో-జెమికా అరిబాడో జోడీతో తలపడింది. భారత జోడీ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. కేవలం అరగంటలోపే మ్యాచ్‌ను ముగిస్తూ 11-3, 11-5తో వరుస గేముల్లో విజయం సాధించింది. తొలి గేమ్‌ను తొమ్మిది నిమిషాల్లో, రెండో గేమ్‌ను పది నిమిషాల్లో గెలిచిన భారత జోడీ.. సెమీఫైనల్ బెర్త్‌తో పాటు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. జోష్నా అనుభవం, వెలవన్ సెంథిల్‌కుమార్ దూకుడు భారత జోడీ విజయానికి కీలకంగా నిలిచాయి. ప్రత్యర్థులు పుంజుకునేందుకు ప్రయత్నించినప్పటికీ.. భారత ఆటగాళ్లు ఆధిపత్యాన్ని కొనసాగించారు. మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి పాయింట్ వరకు వ్యూహాన్ని సమర్థంగా అమలు చేసి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆరు ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్న భారత స్క్వాష్ దిగ్గజం సౌరవ్ ఘోషల్ రికార్డును కూడా జోష్నా అధిగమించారు. 2002 నుంచి వరుసగా ఏడు క్రీడల్లో పాల్గొనడం ద్వారా భారత క్రీడా చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందారు. సెమీఫైనల్లో జోష్నా-వెలవన్ జోడీ హాంకాంగ్‌కు చెందిన యో కా లీ-మింగ్ హాంగ్ టాంగ్ జోడీతో తలపడనుంది. ఈ మ్యాచ్ శనివారం జరగనుంది. ఇప్పటికే పతకం ఖాయం చేసుకున్న భారత జోడీ.. సెమీఫైనల్లో విజయం సాధిస్తే ఫైనల్‌కు చేరి స్వర్ణం లేదా రజతం కోసం పోటీ పడుతుంది. 40 ఏళ్ల వయసులోనూ అంతర్జాతీయ స్థాయిలో జోష్నా తన ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. దేశం కోసం పతకం గెలవడం తన కెరీర్‌లో ఎప్పటికీ ప్రత్యేకమైన ప్రేరణ అని ఆమె పేర్కొన్నారు. తాజా విజయంతో 16 ఏళ్ల విరామం తర్వాత ఏషియన్ గేమ్స్‌లో మరో పతకాన్ని ఖాయం చేసుకున్నారు.



# పరిశ్రమను వెంటాడుతున్న పార్ట్-2 ఫ్లాప్ సెంటిమెంట్!

ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమను విచిత్రమైన భయం వెంటాడుతోంది. ఒకప్పుడు బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన బ్లాక్‌బస్టర్ సినిమాలకు సీక్వెల్స్ (పార్ట్-2) తెరకెక్కించడం అక్కడ ఓ ట్రెండ్‌గా మారినా? ఆ సీక్వెల్స్ సాధిస్తున్న ఫలితాలు మాత్రం మేకర్స్‌ను భయాందోళనకు గురిచేస్తున్నాయి. భారీ అంచనాల మధ్య వచ్చిన పార్ట్2 చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా పడటంతో పరిశ్రమలో సీక్వెల్స్ ఫ్లాప్ సెంటిమెంట్ ఓ పెద్ద గండంలా తయారైంది. గతంలో వచ్చిన చిత్రాల ఘనవిజయాన్ని ఆధారంగా చేసుకుని తీసిన అనేక పార్ట్-2 సినిమాలు ప్రేక్షకులను తీవ్రంగా నిరాశపరిచాయి. శంకర్-కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత వచ్చిన -ఇండియన్ 2- బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. పి. వాసు-రాఘవ లారెన్స్ కాంబినేషన్ లో రిలీజ్ అయిన -చంద్రముఖి 2-, విక్రమ్ -సామి 2-, విశాల్ -పందెంకోడి 2- వంటి చిత్రాల ఫలితాలు తారుమారయ్యాయి. తాజాగా రిలీజ్ అయిన సర్దార్ 2 కూడా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. మొదటి భాగాలు సాధించిన విజయంలో సగం కూడా సాధించలేక డిజాస్టర్లుగా





ముగిసాయి. సీక్వెల్స్ వరుసగా పరాజయం పాలవ్వడానికి ప్రధాన కారణం మొదటి భాగం పెంచిన అంచనాలే అని విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి భాగంలో ఉన్న కథా బలం, భావోద్వేగాలు , వినోదం సీక్వెల్స్‌లో లోపించడమే ఫ్లాప్‌లకు కారణం. కేవలం బ్రాండ్ నేమ్‌ను, క్రేజ్‌ను మాత్రమే నమ్ముకుని స్క్రిప్ట్‌పై సరైన శ్రద్ధ పెట్టకపోవడం వల్ల ప్రేక్షకులు ఈ చిత్రాలను నిర్దాక్షిణ్యంగా తిరస్కారించనే మాట బలంగా వినిపిస్తోంది. దీంతో నిర్మాతలు వందల కోట్ల నష్టపోయారు . ఈ ప్రతికూల పరిస్థితులు పార్ట్-2 ఫ్లాప్ సెంటిమెంట్ నడుమ తాజాగా కోలీవుడ్ అభిమానుల ఆశలన్నీ రాబోయే కొన్ని క్రేజీ సీక్వెల్స్‌పైనే నెలకొన్నాయి. సూపర్ స్టార్ రజనీకాంత్ - నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో తెరకెక్కుతోన్న -జైలర్ 2-, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో కార్తి హీరోగా తెరకెక్కనున్న -ఖైదీ 2-, లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ (రాజఖ)లో భాగంగా రానున్న కమల్ హాసన్ -విక్రమ్ 2- చిత్రాలపై భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రాలు ఆ దర్శక, హీరోల ప్రతిష్టకే కాకుండా కోలీవుడ్‌లో సీక్వెల్స్‌పై పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించడానికి కీలకంగా మారాయి. ముఖ్యంగా లోకేష్ కనగరాజ్ వంటి ప్రతిభావంతులైన దర్శకులు తెరకెక్కించే -ఖైదీ 2-, -విక్రమ్ 2- చిత్రాలు కంటెంట్ పరంగా పక్కాగా ఉంటాయని.. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తాయని సినీ ప్రియులు బలంగా నమ్ముతున్నారు. ఏదేమైనా సీక్వెల్ తీయడం అనేది కత్తిమీద సాము లాంటిదని తమిళ పరిశ్రమ మరోసారి గ్రహించింది. ఈ ఫ్లాప్ సెంటిమెంట్‌ను చెరిపివేసి రాబోయే చిత్రాలు కోలీవుడ్ బాక్సాఫీస్‌కు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడతాయా? లేదా? అన్నది చూడాలి.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com